J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 41 సంచిక : 05 9.7.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## రాంగ్ ట్రాక్‌పై ర్యాంప్‌వాక్




భారతీయ మీడియా ఇప్పుడు కొత్తపుంతలు తొక్కుతోంది. ఒకప్పుడు గోడ పత్రికలు ఉండేవి, రేడియోలో వచ్చే వార్తలు ఎవరో ఒకరు విని గోడ మీద రాస్తే... ఆ ఊరివాళ్ళు తెలుసుకునేవారని పెద్దలు చెప్పేవారు. వాస్తవానికి ప్రపంచంలోనే భారతీయ మీడియా అత్యంత పురాతనమైనదని చరిత్ర చెప్తోంది. 1780లోనే అశోకుడి కాలానికి ముందే భారతదేశంలో ప్రింట్ మీడియా ఉండేదని 'హిక్కిస్ బెంగాల్ గెజిట్' అనే పేరుతో తొలి భారతీయ వార్తాపత్రిక వెలువడిందని, అలాగే 1927లో రేడియో బ్రాడ్‌కాస్టింగ్ మొదలైందని కూడా ఆధారాలు ఉన్నాయంటూరు పరిశోధకులు.

### తప్పుదోవ పడుతున్న మీడియా

2018 మార్చి31 నాటి లెక్కల ప్రకారం రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్ పేపర్స్ ఫర్ ఇండియా (RNI) వద్ద లక్ష పేపర్లకు పైగా రిజిస్టర్ కాబడ్డాయట. న్యూస్‌పేపర్ల మార్కెట్లో ప్రపంచంలోనే భారతదేశానిది రెండవ స్థానం అంటే, మన దేశంలో మీడియా ఎంతటి విస్తృత స్థాయిలో సమాజంపై దండయాత్ర

10 లో

## భారతదేశంలో టాప్ 50 'రియల్' ధనవంతులలో..

3లో

# అయిదుగురు నెల్లూరోళ్ళు

### మొత్తం 50 మందిలో 7గురు తెలుగోళ్ళు

యస్.యస్.రెడ్డి



అపర్ణ కన్‌స్ట్రక్షన్స్
5200 కోట్లు

సి.వి.రెడ్డి



అపర్ణ కన్‌స్ట్రక్షన్స్
4350 కోట్లు

మనోజ్ నంబూరు



అలయన్స్ గ్రూప్
2175 కోట్లు

సునీల్ బొమ్మిరెడ్డి



అలయన్స్ గ్రూప్
2150 కోట్లు

చెరుకూరు సుబ్బారెడ్డి



సీబ్రోస్ ప్రాపర్టీస్
980 కోట్లు

## ఆమె ఇక, YS షర్మిల కాదు.. TS షర్మిల

ఈ వారం 'మనలో మాట' 8 లో



మహానేత వైయస్ 72వ జయంతి సందర్భంగా జులై 8 గురువారం ఉదయం ఇడుపులపాయలోని వైయస్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న వైయస్ విజయమ్మ, షర్మిల మరియు ఇతర కుటుంబసభ్యులు



# బాధ్యతలు చేపట్టిన డిసిసిబి సిఇఓ శంకర్‌బాబు



జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డిసిసిబి) సిఇఓగా చల్లా శంకర్‌బాబు ఈనెల 5న నెల్లూరులోని డిసిసిబి కార్యాలయంలో సిఇఓగా బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు డిసిసిబి జనరల్ మేనేజర్‌గా ఉన్న శంకర్ బాబును నెల్లూరుకు బదిలీ చేయడంతో ఆయన ఇక్కడికి వచ్చి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన్ను బ్యాంక్ అధికారులు, సిబ్బంది స్వాగతించి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు.

# శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి



జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమం ఈనెల 5న నెల్లూరులో బిజెవైఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని అందరికీ సూచించారు. బిజెవైఎం జిల్లా శాఖ అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. బిజెవైఎం నాయకులు ప్రవీణ్, మస్తాన్, నవీన్, వెంకట్, శివ, బాబు, నాగేంద్ర, శ్రీనివాసులు, ప్రియ పాల్గొన్నారు.

# గర్భవతులకు శ్రీమంతం



గూడూరు, బనీగీసాహెబ్‌పేటలోని అంగన్‌వాడి స్కూల్‌లో ఈ నెల 5వ తేదీన ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో గర్భవతులకు శ్రీమంతం కార్యక్రమం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు పూడి శ్రీధర్, పూర్ణచంద్ర, వాచ్‌షాప్ రాము, పిల్లిల శీను, కె.ఆర్.ఎం, కో-ఆర్డినేటర్ సతీష్, అంగన్‌వాడీ టీచర్ సుజున భార్గవి తదితరులు పాల్గొన్నారు.

# తహశీల్దార్ల బదిలీలు

జిల్లాలో పలువురు తహశీల్దార్లు బదిలీ అయ్యారు. అడ్‌హాక్ తహశీల్దార్లకు పదోన్నతి కలిగింది. ఆ మేరకు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఈనెల 5న ఉత్తర్వులు జారీచేశారు. కలిగిరి తహశీల్దారు జి. రాఘవేంద్రరావు దొరవారిసత్రానికి, దొరవారిసత్రం తహశీల్దారు సిహెచ్ పద్మావతిని కలిగిరికి బదిలీ చేశారు. అదేవిధంగా పెళ్ళకూరు తహశీల్దారు కెవిబిటి సుందరమ్మను కలెక్టరేట్ ఎఫ్ సెక్షన్‌కు బదిలీ చేశారు. అడ్‌హాక్ తహశీల్దార్లుగా పనిచేస్తున్న పి. గీతావాణిని గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయానికి డిఏఓగా, డి.లాజరస్‌ను ఓజిలి తహశీల్దారుగా, కె. చంద్రశేఖర్‌ను విడవలూరు తహశీల్దారుగా, ఎస్‌డి నౌషాద్ అహ్మద్‌ను వెంకటగిరి తహశీల్దారుగా పదోన్నతి కల్పించి బదిలీ చేశారు. డెప్యూటీ తహశీల్దార్లుగా పనిచేస్తున్న ఎస్ శ్రీనివాసులురెడ్డిని ఆనంతసాగరానికి, బి. జయవర్ధన్‌ను దుత్తలూరుకు, ఎస్ రమేష్‌ను తడకు, పసుపులేటి హేమంత్‌కుమార్‌ను వరికుంటపాడుకు అడ్‌హాక్ తహశీల్దార్లుగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు.

# బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు

సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆ శాఖ ఉప సంచాలకులు జీవపుత్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్-4 సర్వీసులో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ పోస్టులు 4, జూనియర్ ఆడిటర్ 1, టైపిస్ట్ 9, టెక్నికల్ అసిస్టెంట్ పోస్టు 1, ఫిషర్‌మెన్ 2, ల్యాబ్ అటెండర్ పోస్ట్ 1 వంతున ఉన్నాయన్నారు. నాల్గోతరగతి సర్వీసు కింద ఆఫీసు సబార్డినేట్ పోస్టులు 18, కాపలదారు 13, వంటమనిషి 3, స్వీపర్లు 2, గార్డెనర్ 1, మెసెంజర్లు 3, వాటర్‌మెన్, వాచ్‌మెన్ పోస్టులు ఒక్కోటి వంతున ఉన్నాయని, అర్హులైనవారు ఈనెల 7 నుంచి 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత ధృవీకరణ పత్రాలను జతచేయాలని, ఆ పత్రాలను గెజిటెడ్ అధికారితో అటెస్ట్‌చేయించి సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. వివరాలకు 99899 43408 ఫోన్ నెంబరుకు సంప్రదించాలని కోరారు.

# పాఠశాలల క్రీడా సమాఖ్యకు కొత్త కార్యదర్శి



జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్యకు నూతన కార్యదర్శిగా కోవూరు జడ్పీ హైస్కూలు వ్యాయామ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న దేవిక నియమితులయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ ఆ మేరకు ఆమెను కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో బాలబాలికల క్రీడాజట్లను ఎంపికచేసి జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్‌ను ప్రగతిపథంలో నడిపించి జిల్లా కీర్తిని ఇనుమడింప జేయాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు.



## మాజీ గవర్నర్ రోశయ్య

# జన్మదిన వేడుకలు

తమిళనాడు మాజీ గవర్నర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 89వ రోజు పుట్టినరోజు వేడుకలు ఈ నెల 4న ఆయన గృహంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నెల్లూరుకు చెందిన ఆయన మిత్రుడు, ఆర్యవైశ్య ప్రముఖులు కె.వి.చలమయ్య ఆయన ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ రంగనాథస్వామి, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారు, శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, సూళ్లూరుపేట చెంగాళమ్మ అమ్మవారి ప్రసాదాలను రోశయ్యకు అందజేసి ఘనంగా సత్కరించారు.

## ప్రభుత్వ ఉద్యోగాలను

# భర్తీ చేయండి

**- బీసి సంక్షేమ సంఘం వినతి**

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వశాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను ప్రభుత్వం వెంటనే భర్తీచేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా శాఖ అధ్యక్షురాలు విజయమ్మ తదితరులు కోరారు. ఇటీవల జిల్లా కలెక్టర్‌కు వారొక వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో నిరుద్యోగం పెరుగుతోందని, నిరుద్యోగుల వయోపరిమితి దాటిపోతోందని, విద్యార్హతలు కలిగిన నిరుద్యోగులు దాదాపు కోటిమంది దాకా ఉన్నారని పేర్కొంటూ ప్రభుత్వం వెంటనే ఉద్యోగాలను భర్తీచేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కోరారు. తాము అధికారంలోకి రాగానే లక్షా 30వేల ఉద్యోగాలను భర్తీచేస్తామని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు కేవలం 10,153 పోస్టుల భర్తీకే నోటిఫికేషన్ విడుదల చేయడం విడ్డూరమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.84 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీచేయాలని కోరారు. నిరుద్యోగుల వయోపరిమితిని 47 సంవత్సరాలకు పెంచాలని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ల

# వితరణ

గివ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల ఇందుకూరుపేట ప్రభుత్వ ఆసపత్రికి 5 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను వితరణగా అందజేశారు. సంస్థ ప్రతినిధి బషీర్‌ను ఈ సందర్భంగా స్థానిక వైకాపా నేత గునపాటి సురేష్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో గురజాల జ్ఞాన స్వరూప్, భానుచంద్రశేఖర్, వాసుబాబు పాల్గొన్నారు.

## ఆక్సిజన్‌కు లోటు లేకుండా..

# మరిన్ని ప్రతిపాదనలు

**జేసీ గణేష్‌కుమార్**

కరోనా విజృంభణ దశల్లో రోగులు బెడ్లు లేక, ఆక్సిజన్ అందక ఎన్నో అవస్థలు పడ్డారని, ఒకవేళ మూడో దశ కరోనా విజృంభిస్తే బాధితులకు ఇకపై ఆ లోటు లేకుండా జిల్లాలో మరిన్ని ఆక్సిజన్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపుతామని జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ చెప్పారు. ఈనెల 5న ఉదయగిరిలో ఆసుపత్రులను పరిశీలించిన సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 50 పడకల ఆసుపత్రులున్న రాపూరు, అల్లూరు, ఉదయగిరి ప్రాంతాల్లో 500 లీటర్ల ఆక్సిజన్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు కృషిచేస్తున్నామన్నారు. కరోనా మూడోవేవ్ వస్తుందంటున్న హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని ఆసుపత్రుల్లో పడకల సంఖ్య పెంచేందుకు, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ల ఏర్పాటుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జేసీతో పాటు ఆసుపత్రి సూపరింటెండెంట్ మాళవిక, డాక్టర్ సుభానీబాషా, ఎంపిడిఓ వీరాస్వామి పాల్గొన్నారు.

# తెలంగాణ జలదోపిడీని అడ్డుకోవాలి

**బిజెపి నేత మిడతల రమేష్**

తెలంగాణ జలదోపిడీని ప్రభుత్వం వెంటనే అడ్డుకోవాలని, కృష్ణాజలాల్లో సగం నీళ్ళు తెలంగాణవేనని తెలంగాణ సిఎం కేసిఆర్ చెప్పడం జలదోపిడీకి నిదర్శనమని తెలుగు గంగ జలహక్కుల కమిటీ కన్వీనర్, బిజెపి నాయకుడు మిడతల రమేష్ ధ్వజమెత్తారు. ఈనెల 5న కోవూరులోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జూరాల, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల్లోని నీటినంతా తెలంగాణ తోడేసుకోవడం తగదన్నారు. ఈనెల 9న జరగనున్న కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ సమావేశంలో తెలంగాణ జలదోపిడీని రాష్ట్రప్రభుత్వం సమర్థవంతంగా తిప్పికొట్టాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో స్థానిక బిజెపి నాయకులు ఐ.రఘురామయ్య, కేతా పెంచలరెడ్డి, బేతిరెడ్డి నగేష్, పచ్చిపాల హరనాధరెడ్డి, శ్రీకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కల్పించి ఆదుకోండి మహాప్రభో

**గంగ ఎస్ఇకి ముంపు బాధితుల మొర**



తెలుగుగంగలో అంతర్భాగమైన కండలేరు రిజర్వాయర్ ఆనకట్ట నిర్మాణ సమయంలో ఇళ్ళు, భూములు, ఇతర జీవనాధారాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు చెందిన నిరుద్యోగులకు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలంటూ ముంపు గ్రామాలకు చెందిన పలువురు నిరుద్యోగులు ఇటీవల నెల్లూరులోని తెలుగుగంగ ఎస్ఇ హరినారాయణరెడ్డికి మొరపెట్టుకున్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ, జారీ చేసిన జిఓ ప్రకారం ముంపు బాధితుల కుటుంబాల్లోని నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని వారు కోరారు. కండలేరు పరిధిలోని 22 ముంపు గ్రామాల నుంచి 1925 మంది అభ్యర్థులు ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకుని ఏళ్ళతరబడి ఎదురుచూస్తున్నారని, ఇప్పటికైనా కరుణించి తమకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వారు కోరారు.

# సిఎం మేలు మరువలేం

**జిల్లా రెవెన్యూ సంఘం నేతలు**

గతంలో ఎన్నడూ లేనివిధంగా రెవెన్యూ శాఖలో ఒకేసారి 152 మంది డీటీలకు డిపిసి ద్వారా తహశీల్దార్లుగా పదోన్నతి కల్పించిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మేలు మరువలేనిదని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు సూర్యనారాయణసింగ్, అల్లంపాటి పెంచలరెడ్డి అన్నారు. నెల్లూరులోని కలెక్టరేట్ ఆవరణలో ఉన్న తమ సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యవర్గసభ్యుల సమావేశంలో వారు మాట్లాడుతూ సిఎం చూపిన చొరవకు సంతోషం వ్యక్తం చేశారు. సంఘం కోశాధికారి డానియల్ పీటర్, జిల్లా ఉపాధ్యక్షురాలు బాలకోటమ్మ, నిర్వహణ కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలో చేరేందుకు.. దరఖాస్తులు

నెల్లూరుజిల్లా కొడవలూరులోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ దేవసహాయం, వార్డెన్ నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తరగతిలో 40 సీట్లకు గాను ఎస్టీలకు 32, ఎస్సీలకు 5, బీసీలకు 2, ఓసీలకు 1 వంతున సీట్లను కేటాయించారని, అదేవిధంగా 4వ తరగతిలో 39, 5వ తరగతిలో 19, 6వ తరగతిలో 18, 7వ తరగతిలో 14, 8వ తరగతిలో 14, 9వ తరగతిలో 9 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఈ సీట్లను ఎస్టీలకు కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. అర్హులైనవారు ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తులు పంపుకోవాలన్నారు. ఒకవేళ ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వస్తే లాటరీ పద్ధతిలో సీట్లను కేటాయిస్తామన్నారు.

## భారతదేశంలో టాప్ 50 'రియల్' ధనవంతులలో..

# అయిదుగురు నెల్లూరోళ్ళు



నెల్లూరోళ్ళంటే నెల్లూరోళ్లే. ప్రపంచం నలుమూలలా నెల్లూరోళ్ళు ఎక్కడవున్నా వాళ్ళకు వాళ్ళే సాటి. ఇప్పటికే పలు రంగాలలో తమ ప్రతిభాపాటవాలతో నెల్లూరు కీర్తిని రెపరెపలాడిస్తున్న నెల్లూరీయులు ఇప్పుడు రియల్ఎస్టేట్, నిర్మాణ రంగాలలో కూడా తామేం తక్కువ కాదని నిరూపించారు. అంతర్జాతీయ పత్రిక 'ఏసియా వన్' ఇటీవల చేసిన సర్వే ద్వారా 2020–21 సంవత్సరానికి గాను భారతదేశంలో రియల్ఎస్టేట్ రంగంలో అగ్రగణ్యులుగా రాణిస్తున్న టాప్ 50మంది పేర్లను ప్రకటించింది. ఆయా సంస్థల అధినేతల నికర సంపద ద్వారా వారి స్థానాన్ని నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి 'మై హోమ్' సంస్థల ఛైర్మన్ జూపల్లి రామేశ్వరరావు 7,300కోట్ల సంపదతో 13వ స్థానంలో నిలిచారు. అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ యస్.సుబ్రహ్మణ్యంరెడ్డి 5,200కోట్లతో 21వ స్థానంలోనూ, అదే అపర్ణ సంస్థల డైరెక్టర్ సి.వెంకటేశ్వరరెడ్డి 4,350 కోట్లతో 22వ స్థానంలోనూ నిలిచారు. వీళ్ళిద్దరూ నెల్లూరోళ్ళే. మరో నిర్మాణ సంస్థ రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఛైర్మన్ అయోధ్య రామిరెడ్డి 2,675 కోట్లతో 31వ స్థానంలో ఉన్నారు. ఇక మరో ఇద్దరు నెల్లూరీయులు అలయన్స్ గ్రూప్ & అర్బన్ రైజ్ ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ మనోజ్ నంబూరు 2,175 కోట్లతో 33వ స్థానాన్ని పొందగా అదే సంస్థ వైస్‌ఛైర్మన్ సునీల్ బొమ్మిరెడ్డికి 2,150 కోట్ల సంపదతో 34వ స్థానం లభించింది. చెన్నైకి చెందిన సిబ్రోస్ ప్రాపర్టీ డెవలప్మెంట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ చెరుకూరు సుబ్బారెడ్డి 980కోట్ల ఆస్థిపరుడిగా 47వ స్థానం పొందారు.

ఈ జాబితా మొత్తం దేశంలోని రియల్ సంపన్నులలో మొదటి 50 స్థానాలలో నిలచిన వారిది. ఇందులో డియల్ఎఫ్, హీరా నందిని, ప్రిస్టేజ్ వంటి బడా సంస్థల అధినేతలు అగ్రస్థానంలో నిలిచారు.

తెలుగు రాష్ట్రాల వరకు చూస్తే... తెలంగాణలోని హైదరాబాదుకు సంబంధించి ఈ సర్వేలో 6మందికి స్థానం లభించగా సుబ్రహ్మణ్యంరెడ్డి, సి.వి.రెడ్డి 2, 3 స్థానాలలో ఉన్నారు. మనోజ్ నంబూరు, సునీల్ బొమ్మిరెడ్డిలు హైదరాబాద్ రియల్ ఎస్టేట్ విభాగంలో 5, 6 స్థానాలు పొంది చెన్నై రియల్ కుబేరులలో ఒకటి రెండవ స్థానంలో నిలిచారు. చెన్నైకి సంబంధించి 6 మంది హేమాహేమీలుగా ఉంటే వారిలో చెరుకూరు సుబ్బారెడ్డి 6వ స్థానంలో ఉన్నారు.

మొత్తానికి మొదటి 50 మందిలో తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలలో 7 మంది తెలుగువారు ఉంటే... వారిలో అయిదు మంది మన నెల్లూరోళ్ళు ఉండడం గమనార్హం. తమ ప్రతిభా నైపుణ్యాలతో అనన్య సామాన్య విజయాలను సాధిస్తూ రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలలో ప్రగతిపథం వైపు దూసుకుపోతున్న మన నెల్లూరోళ్ళందరికీ 'లాయర్' శుభాకాంక్షలు.

# త్వరలో జనంలోకి జగన్



భారతదేశ రాజకీయ చరిత్రలో అత్యధిక దూరం పాదయాత్ర చేసి, అత్యంత అధికస్థాయిలో జనాన్ని స్పృశించిన నాయకుడు బహుశా ఆంధ్రా ముఖ్యమంత్రి జగన్ మాత్రమే అని నిస్సందేహంగా చెప్పొచ్చు. ఆయన బంపర్ మెజారిటీతో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసినప్పటి నుండి, సామాన్య జనానికి దూరమైపోయారన్న చర్చ రాజకీయ విశ్లేషకులలో తరచూ వినిపిస్తూనే వుంది. పరిపాలనకు కొత్త కావచ్చు లేక కారోనా కారణం అయ్యి ఉండవచ్చు, ఆయన జనంలోకి రావడం లేదు, చాలామందిని కలుసుకోవడంలేదు అన్నది మాత్రం అక్షరసత్యం. ఇప్పుడు తనపై పడ్డ ఆ మచ్చను తొలగించుకోవడానికి సీయం సమాయత్తమవుతున్నట్లు సంకేతాలు వస్తున్నాయి. కరోనా పూర్తిగా తగ్గుముఖం పట్టగానే వారానికి రెండు సచివాలయాలు సందర్శిస్తానని జగన్‌మోహన్‌రెడ్డే స్వయంగా ప్రకటించారు. జులై 5వ తేదీ సోమవారం జరిగిన స్పందన సమీక్ష కార్యక్రమంలో ఆయన ఈ విషయాన్ని చెప్పారు. సచివాలయాల కార్యకలాపాల పరిధిని పెంచేలా మరో 50సేవలను వాటి పరిధిలోకి తేవడమే కాకుండా ప్రతి వారంలో రెండు సచివాలయాలను సందర్శించి తానే స్వయంగా సచివాలయాల పనితీరును సమీక్షిస్తానని ముఖ్యమంత్రి ప్రకటించారు. శుభం..! కరోనా పూర్తిగా అంతరించిపోవడానికి ఎలాగూ మరో 6నెలలు పడుతుంది, అప్పటికి గతంలో సీయం ప్రకటించినట్లుగా మంత్రివర్గ ప్రక్షాళన కూడా పూర్తవుతుంది. కొత్త టీమ్‌తో ప్రజల్లోకి వెళ్ళి ద్వితీయార్ధంలో ఇటు ప్రభుత్వ పనితీరుని సమీక్షించుకోవడంతో పాటు అటు పార్టీ వ్యవహారాలను చక్కబెట్టుకుని, గాడి తప్పుతున్న పార్టీని దారిలో పెట్టి రెండవసారి అధికారం చేజిక్కించుకోవడానికి తన పర్యటనలను సియం వాడుకోవచ్చు. జగన్ జనంలోకి వస్తే స్వామి కార్యం స్వకార్యం రెండూ జరిగిపోతాయి.

## ఔను.. వాళ్ళు కలిశారు



### బాలినేని - మాగుంట భేటి

ఆంధ్రా కరెంటు మంత్రి బాలినేని శ్రీనివాసుల రెడ్డి, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి జులై 7వతేదీ బుధవారం ఒంగోలులోని ఒక ప్రైవేటు గెస్ట్‌హౌస్‌లో భేటీ అయ్యారు. వీరిద్దరి మధ్య పొరపొచ్చాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు గుసగుసలాడుకుంటున్న తరుణంలో వీరి కలయిక ప్రత్యే కతను సంతరించుకుంది. జిల్లా అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దాం అని ఇద్దరూ షేక్‌హ్యాండ్ ఇచ్చుకున్నట్లు సమాచారం. నెల్లూరు జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, గీతాంజలి సినిమా నిర్మాత ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఈ సంధికి సారధ్యం వహించినట్లు వినికిడి. వీరితో పాటు మంత్రి కుమారుడు, వాసు వారసుడు ప్రణీత్ కూడా వున్నాడు. వీరిద్దరి కలయికతో జిల్లాతో పాటు పార్టీ కూడా బాగుపడిపోతుందని ప్రకాశం జిల్లా వైసిపి వర్గాలు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నాయి.




## 'ప్రభా'తం

# పెట్రో మంట..గ్యాస్‌తో తంటా!

దేశంలో పెట్రో ధరలు తగ్గడమన్న మాటే లేకుండా రోజురోజుకీ ఇంకా భగ్గుమంటుంటే, అన్ని రకాల వస్తువుల ధరలు కూడా మేమెందుకు తగ్గుతామంటూ ఆకాశంలోకి దూసుకుపోతున్నాయి. ఏది కొనాలన్నా, ఏం తినాలన్నా అన్నిటి ధరలు పెరిగిపోతుండడంతో పేదలు, సామాన్యుల జీవనం అస్తవ్యస్తమవుతోంది. ఇంకో వైపు గ్యాస్ ధర కూడా అమాంతం పెరిగిపోయింది. ఇవన్నీ చాలవన్నట్లు ఆగస్టులో పెట్రో సంక్షోభం కూడా తప్పదంటున్నారు నిపుణులు. ఈ ధరల గండం నుంచి ప్రభుత్వాలే ప్రజలను కాపాడడం మినహా మరో మార్గాంతరం లేదు.



అసలే కరోనా కష్టకాలం. పనులు దొరక్క, పూట గడవక పేదలు నానా అవస్థలు పడుతుంటే, ఉపాధి లేక సామాన్య, మధ్య తరగతి ప్రజలు అల్లాడిపోతుంటే గోరుచుట్టుకు తగిలే రోకటిపోట్లు చాలవన్నట్లుగా మరోవైపు ధరల బాదుడు ప్రజల నడ్డి విరగ్గొడుతున్నాయి. పెట్రో ధరలు తగ్గడమన్న మాటే లేకుండా రోజురోజుకీ ఇంకా భగ్గుమంటుంటే, అన్ని రకాల వస్తువుల ధరలు కూడా మేమెందుకు తగ్గుతామంటూ చుక్కల్లోకంలోకి దూసుకుపోతున్నాయి. ఏది కొనాలన్నా, ఏం తినాలన్నా అన్నిటి ధరలు ఆకాశానికి పెరిగిపోతుంటే సామాన్యుల జీవనం అస్తవ్యస్తమవుతోంది. ఇవన్నీ చాలవన్నట్లు ఇంకోవైపు గ్యాస్ ధరలు కూడా తాజాగా అమాంతం పెరిగిపోయి, ఇంట్లో వంటే ఒక మంటగా తయారవుతోంది. అటు పెట్రో మంట..ఇటు గ్యాస్ కొనాలంటే తంటా!.. దేశంలో ఈ గడ్డు పరిస్థితి ఎప్పుడు పోతుందో అంతుపట్టడం లేదు. కానీ, అప్పుడే ఏమైంది..ముందుంది ముసళ్ళ పండగ. పెట్రో సంక్షోభం అనేదొకటి ఆగస్టులో దాపురించేట్లు ఉంది. అప్పుడు పరిస్థితి మరింత గడ్డుగా ఉంటుందంటున్నారు నిపుణులు. అది తలచుకున్నప్పుడల్లా.. స్పీడుగా పోతున్నప్పుడు ఉన్నట్లుండి టైరు ఢాం అని పగిలిపోయినట్లుగా గుండె జారిపోతోంది వాహనదారులకు. ఇదంతా అంతర్జాతీయ చమురుసంస్థల మహిమ. అంతర్జాతీయ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకునే మన దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ చమురు సంస్థలు కూడా పెట్రోలు, డీజిల్ ధరను ఎప్పటికప్పుడు పెంచుకుంటూ పోక తప్పని స్థితి. అందువల్ల లీటరు పెట్రోలు పోసుకోవాలంటే వంద నోటు ఇస్తే తప్ప కుదరడం లేదు. మనదేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఇంకాస్త ఎక్కువగానే ఉంటోంది. దేశ రాజధాని ఢిల్లీలో కూడా లీటరు పెట్రోలు వందకు చేరుకుంటే, డీజిల్ ధర 90 రూపాయల దాకా ఉంది. దేశంలో 14 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో లీటరు పెట్రోల్ ధర వంద దాటేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, ఒరిస్సా, జమ్ముకశ్మీర్, తమిళనాడు, కేరళ, బీహార్, పంజాబ్, లడఖ్, సిక్కింలలో వంద దాటేసిన పెట్రోల్ ధర, దేశ ఆర్థిక రాజధాని ముంబైలో 105 రూపాయలా 92 పైసలకు చేరింది. మన రాష్ట్రంలోని విజయవాడలో తాజాగా లీటరు ధర 106 రూపాయలా 37 పైసల దాకా ఉంటే, తెలంగాణ లోని హైదరాబాద్‌లో 103 రూపాయల 78 పైసలకు చేరుకుంది. కేవలం రెండు నెలల్లోనే లీటరు పెట్రోల్‌పై 10 రూపాయలు, డీజిల్‌పై 9 రూపాయలు పెంచిపారేశారు. మే నెల మొదటి వారం నుంచి ఇప్పటి దాకా సుమారు 35 సార్లు వీటి ధరలు పెరుగుతూ పోతున్నాయంటే, ఇక వీటిని నియంత్రించడం ఎలా సాధ్యమో ఎవరికీ అంతుపట్టడం లేదు. జేబులో డబ్బులు పుష్కలంగా ఉంటేనే పెట్రోలు బంకులుకి వెళ్ళాల్సిందే తప్ప లేకుంటే పాతకాలంలోలా ఏ సైకిలో తొక్కుకుంటూ పోవడమే మేలనుకునే పరిస్థితి వచ్చేసింది. మనదేశంలోనే కాదు ప్రపంచమంతా పెట్రో ధరలు ఇలాగే మండుతున్నా ఆ దేశాలు ఇతరత్రా వనరులతో పెద్దగా ఇబ్బంది పడకపోవచ్చు కానీ, భారత్ వంటి దేశాలే దిక్కుతోచని స్థితిలో పడుతున్నాయి. అందులోనూ ప్రపంచంలోని చమురు ఉత్పత్తి చేస్తున్న సౌదీ అరేబియా, యుఏఇల మధ్య వివాదాలతో చమురు ధరలు ఏరోజుకారోజు ఇష్టానుసారం పెంచేస్తుండడం, ఒపెక్ దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతుండడంతో ప్రపంచవ్యాప్తంగా వీటి ధరలు భారీగా పెరిగిపోతుండడం జరుగుతోందని నిపుణులు చెప్తున్నారు. ఆగస్టు వచ్చేనాటికి వీటి ధరలు ఇంకా పెరగడమే కాక పెట్రో ఉత్పత్తుల సంక్షోభం కూడా తప్పదని జోస్యం చెప్తున్నారు. ఇప్పటికే పెరిగిన ధరలతో కుయ్యోమొర్రో అంటున్న మన భారత్ వంటి దేశాలు ఆగస్టులో మరింత భారీగా పెరగనున్న పెట్రో బాదుడు ఇంకెలా ఉంటుందోననే ఆందోళనతో ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌ను బట్టే మనదేశంలోనూ ధరలుంటాయని, అక్కడ ధరలు పెరిగితే ఇక్కడ కూడా ధరలు పెరుగుతాయని, పెట్రో ఉత్పత్తులపై విధిస్తున్న ఎక్సైజ్ డ్యూటీ తగ్గించేందుకు కూడా మనవద్ద ప్రతిపాదనలేమీ లేవని కేంద్రం స్పష్టం చేస్తోంది. ఇక ఎవరు మాత్రం చేయగలిగేదేముంది?..పెట్రోల్ డీజిల్ ధరలు పెరిగితే రవాణా వాహనాలకు అదనపు భారం తప్పదు కనుక ఆ భారమంతా అన్నిరకాల వస్తువులపై పడి చివరికి పేదలకి, సామాన్యులకి సంకటంగా మారుతోంది. వంటగ్యాస్ ధర పరిస్థితి కూడా అదే. అంతర్జాతీయంగా పెరిగిన చమురు ధరలను దృష్టిలో పెట్టుకుని గ్యాస్ సిలిండర్ ధరను కూడా ఆయిల్ కంపెనీలు ఇటీవల ఏకంగా మరో ఇరవై అయిదున్నర రూపాయలు పెంచాయి. దీంతో సిలిండర్ ధర 861.50 నుంచి 887 రూపాయలకు చేరుకుంది. గత డిసెంబరు నుంచి అంచలంచెలుగా 240 రూపాయల దాకా గ్యాస్ ధరను పెంచేశారు. ఈనెల 2 నుంచి కొత్త వడ్డన ప్రారంభమైంది. దీంతో కేంద్రప్రభుత్వం గతంలో ఇస్తున్న 220 రూపాయల గ్యాస్ సబ్సిడీని పిల్లెత్తుకుపోయింది. ఇప్పుడు టోటాటోటీగా పదోపరకో చెల్లించి అదే చాలు పొమ్మంటోంది. పొయ్యిలో కట్టెలు పెట్టి వంట మొదలుపెడితే పొగతో సెగతో కళ్ళు మండుతున్నాయని గ్యాస్ అలవాటు చేసుకున్నాక, మొదట్లో బాగానే ఉండింది కానీ రానురాను దాని ధర కళ్ళకే కాదు.. ఒళ్ళంతా మంట పుట్టిస్తోంది. ఒకప్పట్లో 450 రూపాయలున్న గ్యాస్ ధర రెట్టింపు కావడం దురదృష్టకరం. దాదాపు 9 వందలు పెట్టి సామాన్యులు గ్యాస్‌ను కొనుక్కోవాలంటే మాటలా?..అటు కేంద్రం, ఇటు రాష్ట్రంలోని ప్రభుత్వాలు ఈ పరిస్థితులను గమనించి, ఈ పెరుగుతున్న ధరలను తట్టుకుని బతకడానికి ప్రత్యామ్నాయంగా వాహనదారులకు, గ్యాస్ వినియోగదారులకు కూడా ఎంతోకొంత సాయం చేసి ఆదుకుంటే తప్ప ఈ ధరల గండం నుంచి పేదలు, సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు బయటపడలేరేమో అనిపిస్తోంది. ప్రభుత్వాలు ఆలోచించాలి మరి!....

## 'మిడతల'కు ఇంతకాలానికి..
# సముచిత స్థానం

### 'నమామి గంగే' రాష్ట్ర ప్రముఖ్‌గా నియామకం



బిజెపికి నమ్మినబంటు, ఎంతో కాలంగా జిల్లాలో బిజెపి జెండాను మోస్తూ సాధారణ కార్యకర్త కంటే ఎంతో నిరాడంబరంగా, నిబద్ధతతో పనిచేసే మిడతల రమేష్‌కు ఇంత కాలానికి పార్టీలో సముచిత స్థానం దక్కింది. ఆయన్ను 'నమామి గంగే' రాష్ట్ర ప్రముఖ్‌గా (బిజెపి జలసంరక్షణ విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా) నియమించడంతో ఆయన సహచరులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మిడతల రమేష్ అంటే నెల్లూరులో తెలియని వారుండరు. ఎప్పుడూ ఏదో ఒక సమస్య చేతపట్టుకుని దాన్ని పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలంటూ అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటారాయన. చిన్నస్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎదిగిన చిత్తశుద్ధి కలిగిన బిజెపి కార్యకర్తగా ఆయనకు మంచి పేరుంది. అదే ఆయనకు మంచిస్థానం సాధించి పెట్టింది. ప్రస్తుతం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా సేవలందిస్తున్న మిడతల రమేష్‌ను 'నమామి గంగే' రాష్ట్ర ప్రముఖ్‌గా నియమిస్తూ బిజెపి రాష్ట్రనేత సోము వీర్రాజు కార్యాలయం నుంచి ఈనెల 6న ఉత్తర్వులు అందాయి. దాదాపు గత పాతికేళ్ళుగా నెల్లూరుజిల్లాలో రైతుల నీటిహక్కుల కోసం, రాయలసీమ రైతుల హక్కుల కోసం ఆయన అలుపెరుగని పోరాటం చేస్తూనే ఉన్నారు. కండలేరు ముంపు బాధితుల కుటుంబాల్లోని నిరుద్యోగులకు గత ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ నేటికీ ఉద్యమిస్తూనే ఉన్నారాయన. అటు పార్టీకి, ఇటు ప్రజలకు, ముఖ్యంగా రైతుల సమస్యలు తీరేందుకు తనవంతు సేవలందిస్తున్న ఆయన్ను బిజెపి అధిష్ఠానం గుర్తించి ఇప్పటికైనా మంచి స్థానం ఇవ్వడం పార్టీ వర్గాలతో పాటు స్థానిక రైతుల్లో కూడా సంతోషం వ్యక్తమవుతోంది.

# ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలి

### ——— రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ వాసిరెడ్డి పద్మ



గూడూరులో తేజస్విని అనే విద్యార్థిని తనను ప్రేమించలేదనే కారణంగా ఒక ప్రేమోన్మాది వట్టపగలు ఆమె ఇంట్లోకి వెళ్లి కత్తితో పొడిచి చంపడం దారుణమంటూ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ వాసిరెడ్డి పద్మ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రేమించకపోతే చంపేస్తారా..మరీ ఇంత ఘోరమా అంటూ ఆమె మండిపడ్డారు. ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన తేజస్విని కుటుంబ సభ్యులను ఆమె ఇటీవల పరామర్శించారు. తేజస్విని మృతదేహాన్ని సందర్శించిన అనంతరం ఆమె కుటుంబసభ్యులను పరామర్శించారు. ఇంజనీరింగ్ చదువుకుంటున్న తేజస్విని అత్యంత కిరాతకంగా హత్యచేసిన వెంకటేష్‌ను కఠినంగా శిక్షించాలన్నారు. ఇటీవలి కాలంలో మహిళలు, యువతులపై ప్రేమోన్మాదుల దాడులు పెరుగుతున్నాయని ఆమె ఆవేదనగా అంటూ ఇలాంటివాళ్లకి గుణపాఠం చెప్పేలా తీర్పులుండాలని అన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకూడదన్నారు. గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ రావు, డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పొట్టేపాళెంలో ఆనందయ్య మందు పంపిణీ



నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టేపాళెం సమీపంలోని ఉయ్యాల కాలువకట్ట, పెన్నా పొర్లుకట్ట ప్రాంతాల్లో నివాసం ఉంటున్న సుమారు వంద గిరిజన కుటుంబాలకు స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకుడు, పొట్టేపాళెం శ్రీ కోదండ రామస్వామి ఆలయం ఛైర్మన్ పొన్నాల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కోవిడ్ నివారణకు ఆనందయ్య ఆయుర్వేద మందును పంపిణీ చేశారు. ఆనందయ్య ట్రస్ట్ సభ్యుడు దగ్గుబాటి రాధాకృష్ణ, ఉప్పాల రామచంద్రయ్యగౌడ్, హరి, జనార్దన్, రవి తదితరులు పాల్గొన్నారు.

# హైవేలో ప్రమాదాలు నివారించండి




జిల్లాలో జాతీయ రహదారిపై ఎక్కడో ఒకచోట రోజూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఆ ప్రమాదాలు కూడా అత్యంత ఘోరంగా జరుగుతున్నాయి. ముఖ్యంగా గూడూరు సమీపంలో ఉన్న హైవేలో ప్రమాదాలు ఎక్కువగా ఉంటున్నాయి. హైవేల నిర్వహణలో లోపాలను పట్టించుకోకపోవడం వల్లనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయనేది అందరూ అనుకుంటున్నదే. రోడ్లు సక్రమంగా ఉండకపోవడం, భద్రతా చర్యలు కట్టుదిట్టంగా లేకపోవడం వంటి అలక్ష్యాల వల్లనే ప్రమాదాలు పెరిగిపోతూనే ఉన్నాయి. ఈ ప్రమాదాల్లో ఎంతోమంది గాయాల పాలవుతుండడం, మరికొందరు మృత్యువాత పడుతుండడం ఆవేదన కలిగిస్తోంది. బాధితుల బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. ఎంతెంతో దూర ప్రాంతాలనుండి ప్రయాణాలు చేసేవారు ఈ ప్రాంతానికి వచ్చి ప్రమాదాలకు గురౌతుండడం అందరికీ బాధను కలిగిస్తోంది. ఎప్పటికప్పుడు అధికారులు రోడ్ల భద్రతపై చర్యలు తీసుకుంటున్నామని చెప్తుంటారే కానీ, హైవేల్లో మాత్రం భద్రత విషయాలను కానీ, హైవే రోడ్లు ఎక్కడైనా బాగలేకుంటే, బాగుచేసే విషయం కానీ పట్టించుకోకపోవడం దారుణం. గూడూరు నుంచి మనుబోలు దాకా ఉన్న నేషనల్‌హైవే గతంలో భారీవర్షాల వల్ల ముంపుకు గురై బాగా దెబ్బతినింది. అక్కడంతా డైవర్షన్ రోడ్డు వేసి సరిపెట్టేశారే తప్ప దానిని ఇప్పటికీ బాగుచేయించకపోవడంతో నిత్యం వాహనాల రాకపోకలకు ఎంతో ఇబ్బందిగా ఉంది. అందువల్లనే ఇది డేంజర్‌జోన్‌గా పేరు తెచ్చుకుంది. ఇటీవలే ఈ పరిసరాల్లోనే హైవే మీద తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వాహనం రోడ్డు ప్రమాదానికి గురై నుజ్జునుజ్జు అయిపోవడమే కాక ఆ వాహనంలో ఉన్న నలుగురు అత్యంత దారుణంగా మృత్యువాత పడ్డారు. ఇకనైనా ఈ తీరు మారాలి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, జిల్లా ఉన్నతాధికారులు అందరూ కలిసి హైవేపై ప్రమాదాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి.

*టి.కె. పాండురంగారావు*, **మనుబోలు.**

# ఉపాధి పనులను పెంచండి

## వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశం




జిల్లాలో ఉపాధి పనుల కల్పన తక్కువగానే ఉందని, వాటిని ఇంకా పెంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఉపాధి హామీ పనుల్లో కూలీలకు 17.18 కోట్ల పనిదినాలు కల్పించి జాతీయస్థాయిలో ఆంధ్రప్రదేశ్‌ను మొదటిస్థానంలో నిలిపేలా కృషిచేసిన కలెక్టర్లను సిఎం ఈ సందర్భంగా అభినందించారు. ఈనెల 6న ముఖ్యమంత్రి తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కరోనా, ఖరీఫ్, సచివాలయ భవనాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ అర్బన్ హెల్త్‌క్లినిక్‌లు, ఇళ్ళ పట్టాలు, వైఎస్సార్ రైతుభరోసా తదితర సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్న తీరును ముఖ్యమంత్రి సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అమలుచేయడంలో నెల్లూరుజిల్లా ముందంజలో ఉందని అభినందించారు.

నెల్లూరు కలెక్టరేట్ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, జేసీలు హరేందిరప్రసాద్, గణేష్‌కుమార్, విదేహ్‌ఖరే, బాపిరెడ్డి, ట్రైనీ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, కార్పొరేషన్ కమిషనర్ దినేస్‌కుమార్, డిఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి, డిపిఓ ధనలక్ష్మి, డిఆర్‌ఓ చిన్నఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

# 14 దాకా పశుగ్రాస వారోత్సవాలు

జిల్లాలో ఈనెల 7 నుంచి పశుగ్రాస వారోత్సవాలు జరుగుతున్నాయి. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సోమయ్య ఆధ్వర్యంలో ఆ శాఖ అధికారులు, సిబ్బంది ఈనెల 14వ తేది దాకా నిర్వహించే ఈ వారోత్సవాలను పురస్కరించుకుని పశు గణాల అభివృద్ధికి రైతులు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తున్నారు. ఈ సందర్భంగా రైతులకు సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలను కూడా అందజేస్తున్నారు.

# దేశమంతా జగన్ వైపు చూస్తోంది

## - నెల్లూరు ఎంపీ ఆదాల

దేశమంతా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైపు, ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తోందని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. నెల్లూరులో ఈనెల 6న 41, 42 డివిజన్లలో జరిగిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్న పరిపాలన, సంక్షేమ కార్యక్రమాలకు దేశవ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నాయని కితాబు ఇచ్చారు. సీఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలలో 97 శాతం అమలు చేశారని పేర్కొన్నారు. నెల్లూరు నగరంలో 30 వేల ఇళ్ళ స్థలాలు ఇస్తున్నామని తెలిపారు. పట్టణాల్లో పేదలకు స్థలాలు కొనడం సాధ్యంకాదని, అంకణం లక్ష రూపాయల వరకు పలుకుతోందని, అందుకే కరోనా సమయంలో ఆదాయం లేకున్నా ఇళ్లస్థలాలు ఇస్తున్నామని తెలిపారు. ఇది పేదలకు స్థిరాస్తి అవుతుందని, బిడ్డలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే పెన్షన్లు, అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. విద్య, ఆరోగ్యం మీద మన రాష్ట్రమే ఎక్కువగా ఖర్చుపెడుతోందని పేర్కొన్నారు. వయసులో చిన్నవాడైనా జగన్మోహన్‌రెడ్డిని 20 ఏళ్ల పాటు సీఎంగా కొనసాగేందుకు ఆశీర్వదించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మెన్ రంగారెడ్డి, మాజీ కార్పొరేటర్



స్వర్ణ వెంకయ్య, మల్లు సుధాకర్‌రెడ్డి, రూప్‌కుమార్‌యాదవ్, చాట్ల నరసింహారావు, మధు, మున్సిపల్ కమిషనర్ దినేష్ కుమార్, ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్, మైనారిటీ నాయకులు హంజా హుసేని, యస్‌ఆర్ ఇంతియాజ్ పాల్గొన్నారు.

# బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి

మాజీ ఉప ప్రధాని, ప్రముఖ నేత దివంగత బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఈనెల 6న వైకాపా నెల్లూరు పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఘననివాళులర్పించారు. నెల్లూరులోని వైకాపా జిల్లా కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాకాణి మాట్లాడుతూ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధునిగా, ప్రజల నాయకునిగా బాబా జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశభక్తితో సమాజ సేవాభిలాషతో బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారని ఆయన ప్రశంసించారు. తొలుత జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.



## రెండేళ్ళలో నగరంలో..

# ఎన్నో అభివృద్ధి పనులు

## త్వరలోనే మూలాపేట కోనేరును ప్రారంభిస్తాం

**- మంత్రి డాక్టర్ అనిల్**



గత రెండేళ్ళలో నెల్లూరు నగరంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి అమలు చేస్తున్నామని, ప్రజలకు కలకాలం ఉపయోగపడేలా పటిష్టవంతంగా పనులు చేయిస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ చెప్పారు. ఈనెల 5న ఆయన అధికారులతో కలసి నగరంలోని మూలాపేటలో ఉన్న కోనేరును సందర్శించారు. అభివృద్ధి పనులను పరిశీలించి మాట్లాడుతూ త్వరలోనే కోనేరు ప్రారంభిస్తామని తెలిపారు. తమ ప్రభుత్వం ఏ పని చేసినా ప్రజలకు ఉపయోగపడేలా ఉంటుందన్నారు. గత ప్రభుత్వం సాలుచింతలలో ఉన్న వందలాది కుటుంబాలను రోడ్డున పడేసిన విషయం అందరికీ తెలిసిందేనని, అలాంటి నీచమైన పనులను తామెప్పుడూ చేయబోమని మంత్రి స్పష్టం చేశారు. సర్వేపల్లి కాలువలో కాంక్రీట్ బెడ్ వేయడం లేదని చెప్పినా కొంత మంది ఇష్టానుసారంగా ఏదేదో విమర్శలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో బాలాజీనగర్‌లో కనీసం కాలువలు కూడా కట్టకుండా రోడ్లు వేసినప్పుడు వాళ్లేం చేస్తున్నారని మంత్రి ప్రశ్నించారు. ఈ ఏడాది కూడా అనేక అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని, ప్రజల సంక్షేమం, అభ్యున్నతే తమ లక్ష్యమని మంత్రి అన్నారు. వైకాపా యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు రూప్‌కుమార్‌యాదవ్, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డితో పాటు అధికారులు పాల్గొన్నారు.

## డిటిసిగా బాధ్యతలు చేపట్టిన మల్లికార్జున్‌రెడ్డి



నెల్లూరులో ఉప రవాణా కమిషనర్ (డిటిసి)గా పనిచేస్తున్న సిహెచ్‌వికె సుబ్బారావు ఇటీవల పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జి డిటిసిగా మల్లికార్జునరెడ్డిని నియమిస్తూ రవాణా శాఖ కమిషనర్ సీతా రామాంజనేయులు ఉత్తర్వులు జారీచేశారు. దీంతో గూడూరులో ఆర్టీఓగా పనిచేస్తున్న మల్లికార్జునరెడ్డి ఇన్‌చార్జి డిటిసిగా బాధ్యతలు స్వీకరించడంతో ఆర్టీఓ సుశీల తదితర సిబ్బంది అందరూ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు చెప్పారు.

## జలవనరుల శాఖ ఎస్ఇగా కృష్ణమోహన్



జిల్లా జనవనరుల శాఖ రెగ్యులర్ ఎస్ఇగా పి.కృష్ణమోహన్ నియమితులయ్యారు. నెల్లూరులోని హరనాధపురంలో ఉన్న జలవనరుల శాఖ ప్రధాన కార్యాలయంలో ఆయన ఇటీవల బాధ్యతలు చేపట్టారు. సెంట్రల్ డివిజన్ ఇఇగా పని చేస్తున్న ఈయనకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

## పెరసం పురస్కారాలు

నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం (పెరసం) 12వ వార్షికోత్సవం సందర్భంగా ఈ ఏడాది పెన్నా సాహిత్య పురస్కారం -2021కి ఇద్దరు కవులకు పురస్కారాలను ప్రకటించింది. పశ్చిమ గోదావరి జిల్లా బయ్యన్నగూడెంకు చెందిన కవి మెట్టా నాగేశ్వరరావు కవితాసంపుటి 'మనిషాక పద్యం', తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన కవి బొల్లోజు బాబా వెలువరించిన కవితాసంపుటి 'మూడో కన్నీటిచుక్క'కు ఈ పురస్కారాలు లభించినట్లు పెరసం అధ్యక్షుడు మోపూరు పెంచల నరసింహం, ప్రధాన కార్యదర్శి అవ్వారు శ్రీధర్‌బాబు తెలిపారు. ఆ ఇద్దరు కవులకు త్వరలో ఈ పురస్కారాలను ప్రదానం చేస్తామన్నారు.

## నెల్లూరు కబుర్లు

# కొత్త ఎస్పీగా.. సిహెచ్ విజయారావు



నెల్లూరుజిల్లాకు కొత్త ఎస్పీగా సిహెచ్ విజయారావు వస్తున్నారు. విజయవాడ రైల్వే ఎస్పీగా పనిచేస్తున్న ఆయన్ను జిల్లా ఎస్పీగా నియమిస్తూ రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాధ్ దాస్ ఉత్తర్వులిచ్చారు. గతంలో ఉన్న ఎస్పీ భాస్కర్‌భూషణ్ కేంద్ర సర్వీసులకు వెళ్ళడంతో ఆ స్థానం గత కొద్దిరోజులుగా ఖాళీగా ఉంది. ఆ స్థానంలో తాత్కాలికంగా డిఐజి త్రివిక్రమవర్మ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎస్పీ స్థానం ఎంతో కీలకమైనది కనుక వెంటనే కొత్త ఎస్పీ నియామకం జరగాల్సింది. కానీ కొద్ది రోజులు ఎవరినీ నియమించకపోవడంతో జిల్లా పోలీసువర్గాల్లోనే కాక, ప్రజల్లోనూ ఉత్కంఠ నెలకొంది. ఎట్టకేలకు నూతనంగా ఎస్పీ విజయారావు నియామకంతో ఉత్కంఠకు తెరపడింది. కొత్త ఎస్పీ సిహెచ్ విజయారావుకు 'లాయర్' శుభాకాంక్షలు!..

## జడ్పీలో కారుణ్య నియామకాలు

**- ఉత్తర్వులిచ్చిన కలెక్టర్**

నెల్లూరు జడ్పీలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబసభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పిస్తూ జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఈనెల 6న ఉత్తర్వులిచ్చారు. సప్తగిరి, కల్యాణ్, నరసింహారావు, నవభరత్‌కుమార్, పవన్‌కుమార్‌లకు జూనియర్ సహాయకులు, టైపిస్టులుగా ఉద్యోగాలిస్తూ ఆ నియామకపత్రాలను వారికి అందజేయడంతో బాధిత కుటుంబవర్గాల్లో ఆనందం నెలకొంది.

## సర్వేపల్లి కాలువ పనుల్లో భారీ అవినీతి

**కోటంరెడ్డి శీనయ్య ఆరోపణలు**



సర్వేపల్లి కాలువ పనుల్లో భారీగా అవినీతి జరుగుతోందంటూ నెల్లూరు నగర తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆరోపించారు. ఈనెల 6న ఆయన నెల్లూరులోని నీటిపారుదల శాఖ ఎస్ఇ కృష్ణమోహన్‌ను కలసి మాట్లాడుతూ వైకాపా నాయకులు ఈ పనులకు సంబంధించిన అంచనాలను మార్చేసి కోట్లాది రూపాయలు దోచుకునేందుకు చూస్తున్నారంటూ విమర్శించారు. భూసార పరీక్షలకు 39 లక్షలు ఖర్చవుతుందా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టిడిపి నాయకులు ఉచ్చి భువనేశ్వరప్రసాద్, పిట్టి సత్యనాగేశ్వరరావు, మామిడాల మధు, కప్పిర శ్రీనివాసులు, సాబిర్‌ఖాన్, జయరాజ్, మహేంద్రరెడ్డి, పసుపులేటి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

**- సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన**



అకారణంగా తమను ఉద్యోగాల నుంచి తొలగించడం న్యాయం కాదని, తమను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి చెందిన అవుట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులు కోరారు. ఈ నెల 6న ఆ మేరకు వారు నగరంలోని గాంధీబొమ్మ సమీపం లోని లేబర్ ఆఫీస్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నాందోళన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ దాదాపు 150 మంది పారిశుద్ధ్య కార్మికులు రోడ్డున పడ్డారని, వారిని వెంటనే ఆదుకోవాలని కోరారు. సిఐటియు ఉపాధ్యక్షుడు సతీష్‌కుమార్, నాయకులు అజీజ్, రూరల్ ప్రధాన కార్యదర్శి అల్లాడి గోపాల్ పాల్గొన్నారు.

## గొలుసు దొంగల ఆటకట్టించడానికి..

# ఆరు ప్రత్యేక బృందాలు

**- వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ**



నెల్లూరు నగరంలో, ముఖ్యంగా వేదాయపాళెం ప్రాంతంలో ఇటీవల గొలుసు దొంగతనాలు పెరిగిపోయాయి. మహిళలు ఒంటరిగా వెళ్తుంటే, వెనుకనే వేగంగా ఏ మోటార్ బైక్ మీదనో వచ్చి మెడలో ఉన్న బంగారు గొలుసుల్ని తెంపుకుపోతున్నారు. ఈజీ మనీ సంపాదనకి కొందరు దుండగులు ఈ మార్గం ఎంచుకున్నట్లుంది. ఈనెల 5న కూడా బివినగర్ కృష్ణమందిరం వద్ద ఓ వృద్ధురాలి మెడలో ఉన్న నాలుగున్నర సవర్ల బంగారు గొలుసును తెంపుకుని పోయారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. మోటారుబైక్‌పై వేగంగా వచ్చి మహిళలను భయభ్రాంతులను చేస్తూ గొలుసు దొంగతనాలకి పాల్పడుతున్న దొంగల ఆటకట్టించాలని వేదాయపాళెం పోలీసులు పకడ్బందీగా వ్యూహం రచిస్తున్నారు. నిరంతర నిఘా ఏర్పాటుతో పాటు 6 ప్రత్యేక పోలీసు బృందాలను కూడా ఏర్పాటుచేసి వీధుల్లో గస్తీ ముమ్మరం చేశారు. అన్ని ప్రాంతాల్లో పోలీసులు మఫ్టీలో విధులు నిర్వహిస్తూ చీమ చిటుక్కుమన్నా సరే వెంటనే గుర్తించి గొలుసు దొంగల భరతం పట్టేందుకు సిద్ధమయ్యారు.

### మహిళలు అప్రమత్తంగా ఉండాలి

నగరంలో గొలుసు దొంగల బెడద పెరుగుతున్న నేపథ్యంలో వారిని పట్టుకునేందుకు అన్నివిధాలా చర్యలు తీసుకుంటున్నామని, గొలుసు దొంగల బారిన పడకుండా మహిళలు అప్రమత్తంగా ఉండాలని, బంగారు నగలు బయటకు కనిపించకుండా దుస్తులు కప్పుకోవాలని వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ సూచించారు. వేకువఝామునే లేచి ఇళ్ల ముందు ముగ్గులు వేసే మహిళలు, పొద్దున్నే వాకింగ్‌కు వెళ్లేవారు మరింత జాగ్రత్తగా ఉండాలని, తమనెవరైనా వెంబడిస్తున్నారా అని గమనించుకుంటూ ఉండాలని, ఎవరైనా అనుమానంగా ఉన్నట్లు అనిపిస్తే వెంటనే 100 టోల్‌ఫ్రీ నెంబర్‌కు గానీ, వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌కు గానీ సమాచారం అందించాలని ఆయన కోరారు.

## ఎన్‌సిసి క్యాడెట్లకు

# ఆన్‌లైన్ శిక్షణ హర్షదాయకం



కోవిడ్ సమయంలో 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి ఆధ్వర్యంలో ఎన్‌సిసి క్యాడెట్లకు ఆన్‌లైన్ శిక్షణా తరగతులను సమర్ధవంతంగా నిర్వహించడం ఎంతో సంతోషదాయకమని గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఆర్ జయకుమార్ ఎన్‌సిసి అధికారులను అభినందించారు. ఎన్‌సిసి వార్షిక తనిఖీల్లో భాగంగా ఈనెల 6న నెల్లూరులోని కొండాయపాళెంలో ఉన్న 10వ ఆంధ్ర నావికాదళ ఎన్‌సిసి కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. తొలుత రికార్డులు పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌సిసి క్యాడెట్లకు మెరుగైన శిక్షణ ఇవ్వడం ద్వారా వారిలో క్రమశిక్షణతో పాటు ఆత్మవిశ్వాసాన్ని, పోరాట పటిమను కలిగించవచ్చన్నారు. ఎన్‌సిసి అభివృద్ధికి కమాండింగ్ ఆఫీసర్ యుగంధర్‌రెడ్డి గత మూడేళ్ళుగా ఎంతో కృషిచేస్తున్నారని ఆయన ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆ యూనిట్ ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ కెప్టెన్ జిఎస్ యుగంధర్‌రెడ్డి, ఆర్‌కె సింగ్, సూపరింటెండెంట్ రాజశేఖర్, గుండాల నరేంద్రబాబు, జి.ఈశ్వరరావు, జేడీ అల్తాఫ్, దీపక్‌కుమార్, టి.రమణ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త జాబ్ క్యాలెండర్ విడుదల చెయ్యాలి

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులన్నీ కలిపి కొత్త జాబ్ క్యాలెండర్‌ను ప్రభుత్వం విడుదల చేయాలని కోరుతూ నెల్లూరులో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 6న బైక్‌ర్యాలీ నిర్వహించారు. నగరంలోని ఏబిఎం కాంపౌండ్ వద్ద నుంచి ఆర్టీసి బస్టాండ్ దాకా ర్యాలీ కొనసాగింది. పలువురు విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎంవి రమణ, ఎస్‌కె సిరాజ్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.30 లక్షల పోస్టులను కొత్త జాబ్ కాలెండర్‌లో పొందుపరచాలన్నారు.

# దటీజ్.. సోనుసూద్!



- చెప్పింది చేసి.. రియల్‌హీరో అనిపించుకున్నాడు
- ఆత్మకూరుకు చేరుకున్న ఆక్సిజన్ ప్లాంట్ పరికరాలు



చెప్పింది చేశాడు. సినిమాల్లో కాదు నిజజీవితంలో తాను హీరోనే అనిపించుకున్నాడు. దాదాపు కోటి రూపాయలు విలువయ్యే ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణానికి తానిచ్చిన హామీని నిలబెట్టుకుని దటీజ్.. సోనుసూద్ అనిపించుకున్నాడు. కరోనా కష్టకాలంలో దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేస్తూ సమాజానికి తనవంతు సేవచేస్తూ ప్రజలందరి ప్రశంసలకు పాత్రుడవుతున్న ప్రముఖ సినీనటుడు సోనుసూద్ తన సేవాతత్పరతను మరోసారి చాటుకుంటూ జిల్లాలోని ఆత్మకూరులో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన పరికరాలను పంపి జిల్లా ప్రజల ఆదరాభిమానాలు కూడా పొందుతున్నాడు.

కోవిడ్ విజృంభిస్తున్న దశలో ఆక్సిజన్ కొరతతో కరోనా రోగులు ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితుల్లో బాధితులకు ప్రాణవాయువునిచ్చి కాపాడాలని నిర్ణయించుకున్న సోనుసూద్ దేశంలోని అనేకప్రాంతాల్లో తన సొంత నిధులతో ఆక్సిజన్ ప్లాంట్ల ఏర్పాటును ప్రారంభించడం అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో నెల్లూరుజిల్లాలోనూ ఆక్సిజన్ కొరతతో బాధితులు కష్టాలు పడుతున్నారని, మరెందరో ప్రాణాలు కోల్పోతున్నారని తన అభిమానుల ద్వారా తెలుసుకున్న సోనుసూద్ వెంటనే మానవతాహృదయంతో స్పందించారు. జిల్లా కలెక్టర్‌తో సంప్రదించారు. రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి సూచన మేరకు ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటుకు సోనుసూద్ అంగీకరించారు. త్వరలోనే ఆత్మకూరులో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటుకు కృషిచేస్తామని సోనుసూద్ అప్పట్లో చెప్పారు. ఇప్పుడు అక్షరాలా ఆ మాటను నిలబెట్టుకుంటూ దాదాపు కోటి రూపాయలు వ్యయమయ్యే ఆక్సిజన్ ప్లాంట్ పరికరాలను ఆయన ఆత్మకూరుకు పంపి జిల్లా ప్రజల్లో ఆనందం నింపారు. ఈ ప్లాంట్ ఏర్పాటు ద్వారా కనీసం నూరు పడకలకు పైగానే బాధితులకు ఆక్సిజన్‌ను కొరత లేకుండా అందించవచ్చు. ఆత్మకూరుతో పాటు ఉదయగిరి, కడప జిల్లాలోని పలుప్రాంతాల ప్రజలకు కూడా దీనివల్ల ఎంతో ఉపయోగం ఉంటుంది. ఈ పరికరాలను వెంటనే అమర్చేందుకు పనులు ప్రారంభమయ్యాయి. రేపోమాపో జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు ద్వారా ఈ ఆక్సిజన్ ప్లాంట్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

### అభిమానుల్లో ఆనందం

ఆక్సిజన్ ప్లాంట్‌కు సంబంధించిన పరికరాలు గుజరాత్ నుంచి బయలుదేరి ఈనెల 5వ తేదీన ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకోవడంతో ఆర్డీఓ చైత్రవర్షిణి, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎం.సుబ్బారెడ్డి, ఆర్ఎం ఉషాసుందరి, ఎస్ఐ సంతోష్‌కుమార్‌రెడ్డి తదితరులంతా సంతోషంతో స్వాగతం పలికారు. తొలుత నెల్లూరుకు చేరుకున్న ఆ వాహనాలను చూడగానే సోనుసూద్ అభిమానుల్లో ఆనందం మిన్నుముట్టింది. పెద్దఎత్తున ఆ వాహనాలకు వారు స్వాగతం చెప్పారు. జాతీయజెండాను చేతపట్టి ఈ సందర్భంగా సర్వమత ప్రార్థనలు చేశారు. సోనుసూద్ మిత్రుడు సమీర్‌ఖాన్, అభిమానులు హయాస్‌బాబా, షానవాజ్, మునీర్, ఉస్మాన్ తదితరులు పాల్గొని సోనుసూద్ సేవాభావాన్ని కొనియాడారు. జిల్లాకు ఆక్సిజన్ ప్లాంట్‌ను పంపినందుకు అందరూ సోనుసూద్‌కు తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

# ‘దిశ యాప్’.. మహిళలకు రక్షణ కవచం

**- వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి**



రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ‘దిశ యాప్’ కార్యక్రమం మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుందని, ఆపదలో ఉన్న మహిళలకు ఇదో రక్షణ కవచంలా ఉంటుందని మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఈనెల 4న వెంకటగిరిలో ‘దిశ యాప్’పై జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా తీసుకుంటున్న కట్టుదిట్టమైన చర్యల్లో భాగంగా సిఎం జగన్ ఈ యాప్‌ను మహిళలకు చేరువ చేశారని అన్నారు. రాష్ట్రంలో మహిళల సాధికారతతో పాటు, వారి భద్రత పట్ల కూడా సిఎం జగన్ ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఈ యాప్ రూపొందించారని, స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి మహిళ, యువతులు, విద్యార్థినులు అందరూ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. దిశ యాప్ బటన్ నొక్కితే చాలు వెంటనే పోలీసులు వచ్చి ఆపదలో ఉన్న మహిళలకు రక్షణ కల్పిస్తారన్నారు. రాష్ట్రంలో ప్రజలకు ఎన్నోరకాల సంక్షేమ పథకాలను సిఎం జగన్ అమలు చేస్తున్నారని, ఈ పథకాల అమలు విషయంలో తండ్రిని మించిన తనయుడిగా సిఎం జగన్ అందరి అభిమానాన్ని పొందుతున్నారని అన్నారు. సిఎం జగన్ దార్శనిక పాలన ఆదర్శవంతమైనదని కొనియాడారు. జనం మనిషిగా సిఎం జగన్ ఎదుగుతుండడంతో ఇతర రాష్ట్రాలు కూడా ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నాయని, ఏపి తరహా పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు తమ రాష్ట్రాల్లో కూడా అమలు చేయాలనే ఆలోచనలో పడ్డాయన్నారు. తిరుపతి పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ గురుమూర్తి, మునిసిపల్ ఛైర్మెన్ భానుప్రియ, అడిషనల్ ఎస్పీ వెంకటరత్నం పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి.. ఎమ్మెల్యే ప్రసన్న సాయం



కోవూరు మండలంలోని చిన్నపడుగుపాడు గ్రామానికి చెందిన వంశీసింగ్ బ్రైన్ హెమరేజ్ వ్యాధితో కంచిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో బాధిత కుటుంబ సభ్యులకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి 50వేల రూపాయలు సాయంగా అందించారు. వంశీకి మెరుగైన చికిత్సను అందించాలని ఆయన ఆకాంక్షిస్తూ తమ తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బాధిత కుటుంబానికి ఆ మొత్తాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబసభ్యులతో పాటు ఎంపిడిఓ ఎం.శ్రీహరి, పడుగుపాడు ఉపసర్పంచ్ ఎస్‌కె అహ్మద్, వార్డు సభ్యురాలు సబిత తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీ.. ఒక గొప్ప మోడల్ ప్రాజెక్టు

**- పరిశ్రమలు, పెట్టుబడుల ముఖ్య సలహాదారు వీరారెడ్డి**




శ్రీసిటీ దేశంలోనే ఒక గొప్ప మోడల్ ప్రాజెక్టు అని, దేశంలోని 10 గొప్ప తయారీ పరిశ్రమల కేంద్రాల్లో శ్రీసిటీ గుర్తింపు పొందడం ఎంతైనా అభినందనీయమని రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమలు, పెట్టుబడుల ముఖ్యసలహాదారు వీరారెడ్డి ప్రశంసించారు. ఇటీవల ఆయన శ్రీసిటీని సందర్శించి శ్రీసిటీ ప్రగతిని పరిశీలించారు. శ్రీసిటీ రూపకల్పన, అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన పారిశ్రామిక మౌలిక వసతుల అధ్యయనం ప్రధాన ఉద్దేశ్యంగా ఆయన పర్యటన జరిగింది. కడప జిల్లాలోని కొప్పర్తి వద్ద 7వేల ఎకరాల్లో వైఎస్సార్ పారిశ్రామిక పార్కును రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్నందున ఈ పర్యటన మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీసిటీ దేశంలో ఈ రకమైన కొత్త ప్రాజెక్టులకు రెఫరెన్స్ మోడల్‌గా ఉపయోగపడుతుందన్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ వీరారెడ్డి పర్యటన తాము గౌరవప్రదంగా భావిస్తున్నామన్నారు. కొత్త ప్రాజెక్టుల ఏర్పాటుకు ఈ పరిశీలనలు తప్పకుండా సహాయపడతాయన్నారు.

# మినీ స్టేడియం త్వరలోనే పూర్తిచేస్తాం

**- సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి**



పొదలకూరులో మినీ స్టేడియం నిర్మాణం పనులను త్వరలోనే పూర్తిచేసి స్టేడియంలో జాతీయస్థాయి పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామని సర్వేపల్లి శాసనసభ్యుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు.

ఈ నెల 5న ఆయన తోడేరు వీవర్సు కాలనీ వద్ద అసంపూర్తిగా ఉన్న క్రీడా ప్రాంగణాన్ని అధికారులతో కలసి పరిశీలించారు. తాను జడ్పీ ఛైర్మెన్‌గా ఉన్నప్పుడు ఈ మినీ స్టేడియం నిర్మాణానికి పనులు ప్రారంభించారని, ఆ తర్వాత అనివార్యకారణాల వల్ల పనులు పూర్తికాకపోవడం బాధ కలిగిస్తోందని అంటూ త్వరలోనే ఈ నిర్మాణాలను పూర్తి చేయిస్తామన్నారు. స్టేడియం నిర్మాణానికి ఎంతో వ్యయప్రయాసలు పడి తన తండ్రి కాకాణి రమణారెడ్డి స్థలాన్ని సేకరిస్తే, జడ్పీ ఛైర్మెన్‌గా తాను నిధులు విడుదల చేశానని, గత పాలకులు ఈ స్టేడియాన్ని బాగు చేయకుండా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. అనంతరం డప్పు కళాకారులకు తప్పెట్లు, దుస్తులు, గజ్జెలు అందజేశారు. డప్పు కళాకారులు గ్రామ సచివాలయాల్లో పేర్లు నమోదుచేసుకుంటే వారికి పెన్షన్ అందించడంతో పాటు వాద్యాలు, ఇతర పరికరాలు కూడా అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కాకాణి చెప్పారు. ఎమ్మెల్యే వెంట డిఎస్‌డిఓ యతిరాజులు, తహశీల్దార్ స్వాతి, ఎంపిడిఓ సుజాత, వైకాపా నాయకులు గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎం.రమణారెడ్డి, ఎస్‌కె అంజాద్, తోట మనోహరం, శేఖర్‌బాబు, డి.విజయభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# ఆమె ఇక, YS షర్మిల కాదు... TS షర్మిల!

**జులై 8.** తెలుగువారి చరిత్రలో గుర్తుండిపోయే రోజు. తెలుగు రాష్ట్రాలలో ఇంటింటికీ తెలిసిన, ఎన్.టి.రామారావు తరువాత... అంతటి అభిమానాన్ని చూరగొన్న డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి జన్మించిన రోజు. ఆయన అభిమానులకు పండుగ రోజు.

ఇప్పుడు, తెలంగాణ చరిత్రలో కూడా జులై 8 భాగం అయ్యింది. ఆయన కుమార్తె షర్మిల అదే రోజున వై.ఎస్.ఆర్. టి.పి పేరిట కొత్త రాజకీయ పార్టీకి శ్రీకారం చుట్టారు. ఆంధ్ర ప్రాంతంలో డాక్టర్ వైఎస్‌కు ఎంతమంది అభిమానులు ఉన్నారో... తెలంగాణలోనూ అంతమంది వీరాభిమానులు ఉన్నారు. అన్ని పార్టీలలోనూ ఉన్నారు. అన్ని జిల్లాలలోనూ.., అన్ని మండలాలలోనూ ఉన్నారు. ఇప్పుడు వారందరినీ ఒక చోటికి తీసుకొచ్చే బృహత్కార్యక్రమానికి జులై 8 నుండి షర్మిల శ్రీకారం చుట్టారు. తెలంగాణ శాసనసభ ఎన్నికలకు ఇంకా దాదాపు రెండు సంవత్సరాల పైబడి సమయం ఉండగానే... ఆమె శంఖం పూరించారు. దాని శబ్దం తెలంగాణ రాష్ట్ర నలు మూలలూ వినిపిస్తున్నది. వై.ఎస్. రోజులలో మీడియా విస్ఫోటం లేదు. పత్రికలే దిక్కు. ఇప్పుడు మీడియా విస్ఫోటం... మనిషి అరచేతిలోకి వచ్చేసింది. చిన్న, పెద్ద... ఆడ, మగ... పేద, ధనిక..., కుర్ర, వృద్ధ... తేడాలు లేవు. స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంటే... సమాచార భాండాగారం ఉన్నట్టే. అందుకే, షర్మిల ప్రతి కదలిక... ప్రతి పలుకు, ప్రతి విమర్శ... కన్ను మూసి తెరిచేంత వ్యవధిలో సమాజాన్ని చుట్టి వచ్చేస్తుంది.



ఆమె నేరుగా కేసీఆర్‌పైనే తన విమర్శనాస్త్రాలను ఎక్కుపెడుతున్నారు. వెరపు లేదు. జడుపు లేదు. కేసీఆర్ పైనే తన గురిని ఎక్కుపెట్టడం ద్వారా.. తన లక్ష్యం ఏమిటో చెప్పకనే చెబుతున్నారు. ఆ లక్ష్యంపైనే చూపు నిలిపి రాజకీయంగా అడుగులు వేస్తున్నారు. నిజానికి కె.చంద్రశేఖరరావు కూడా తెలంగాణలో నెలకొని ఉన్న ఒక ప్రత్యేకమైన అసంతృప్తి వాతావరణాన్ని తనకు అనుకూలంగా మార్చుకుని అందులోనుంచి ఒక ఉద్యమాన్ని సృష్టించి, ఇటలీ మాత కంటికి మాయ తెరలు కప్పి... రాష్ట్రాన్ని విభజింపచేసి... ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, ఆయన వ్యూహాన్ని తక్కువ అంచనా వేయడం కానీ, తక్కువ చేసి మాట్లాడడం గానీ సరి కాదు. ఆయన ఒక రాజకీయ నాయకుడు. ఏ విధమైన వ్యూహం అనుసరిస్తే, రాజకీయాలలో నెగ్గుకు వస్తాము అనే విషయమే 'రాజకీయ నాయకుడు' అనే వారు ఆలోచిస్తారు. దేశము, సమాజము, ప్రజలు, శ్రేయస్సు... మొదలైనవన్నీ 'రాజకీయం' తరువాతే. ఈ భావనకు ఉదాహరణలు మనకు రాష్ట్రాల స్థాయిలో గానీ... కేంద్ర స్థాయిలో గానీ అడుగడుగునా కనపడుతూ ఉంటాయి. అందువల్ల, కేసీఆర్‌ను తప్పు పట్టడానికి ఏమీ లేదు. పడితే... గిడితే.... ఇటలీ మాతను, హాఫ్ ఇండియన్ బోయ్‌ని తప్పు పట్టాలి.




అయితే, ముఖ్యమంత్రి అయిన ఆరేడేళ్ల తరువాత కేసీఆర్ పాలనపై తెలంగాణ సమాజంలో దిగువన... అంటే ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అట్టడుగున ఉన్న అధిక సంఖ్యాక వర్గాలలో పెల్లుబుకుతున్నట్టుగా భావిస్తున్న అసహనాన్ని, అసంతృప్తిని... తన రాజకీయ ప్రయాణానికి ఇంధనంగా మార్చుకోవాలని షర్మిల భావిస్తున్నారు. అందుకే, వై.ఎస్.షర్మిలగానే ఇప్పటివరకూ అందరికీ తెలిసిన ఆమె ఇప్పుడు టి.ఎస్. షర్మిలగా మారిపోయారు.

ఆమె వెనుక ఘనమైన వారసత్వ సంపద ఉంది. ఆమెలో ఊహాతీతమైన దృఢ సంకల్పం ఉంది. తెలంగాణలో అడుగడుగునా వై.ఎస్. అభిమానులు ఉన్నారు. అర్థబలం...అంగబలంకు కొరత లేదు. వీటన్నిటినీ మించి... పైకి ఇప్పుడే కనిపించని 'ఓట్ బ్యాంక్' ఇప్పటికే అంతర్గతంగా ఏర్పడిపోయి ఉంది. అందుకే... ఆమె రాజకీయ ప్రవేశం... పరిశీలకుల దృష్టిని అమితంగా ఆకర్షిస్తున్నది. అప్పుడు... వై.ఎస్. దుర్మరణం చూసి తట్టుకోలేక, గుండె ఆగి చనిపోయినవారి కుటుంబాలను జగన్ పరామర్శించిన రీతిని గుర్తుకు తెచ్చే తీరులోనే... షర్మిల కూడా 'ఓదార్పు' పర్యటనలు ప్రారంభించారు. ఆత్మహత్యలకు పాల్పడిన నిరుద్యోగుల కుటుంబాల ఇళ్లకు వెళ్లి... వారితోబాటే నేలపై కూర్చుని... బాధిత తల్లి, లేదా భార్య, చెల్లి, అక్క, కూతురు... ఎవరైతే వారిని దగ్గరకు తీసుకుని ఒక మహిళగా ఓదార్చుతూ... ఎంతో కొంత ఆర్థిక సాయం అందిస్తున్నారు. బాధిత మహిళ/కుటుంబానికి అండగా తానున్నాననే సందేశాన్ని షర్మిల తెలంగాణ సమాజంలోకి చాపకింద నీరులాగా బలంగా పంపిస్తున్నారు. 2023 ఎన్నికల్లో తన సత్తా ఏమిటో తెలుగు లోకానికి చాటాలనే బలమైన సంకల్పంతో అడుగులు వేస్తున్నారు. వచ్చే ఏడాది ఆమె పాదయాత్రకు సమాయత్తం కావడం తథ్యమనే చెప్పాలి. తెలంగాణ సమాజంలోకి మరింత బలంగా చొచ్చుకుపోవడానికి, క్షేత్ర స్థాయి ముఖ్యులతో కనెక్ట్ కావడానికి, తెలంగాణ ప్రాంత సమస్యలను మరింత లోతుగా.. సవివరంగా ఆకళింపు చేసుకోడానికి, తెలంగాణ సమాజంపై తనదంటూ బలమైన ముద్ర వేయడానికి అన్నట్టుగా.. షర్మిల పాదయాత్రకు శ్రీకారం చుట్టవచ్చు. 'పాదయాత్ర' అంటే....ఆమెకు కొట్టిన పిండి. చిన్నపిల్లల ఆట. అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో షర్మిల 2012 అక్టోబర్ 12 నుంచి ఏకబిగిని మూడు వేల కిలోమీటర్ల పొడవునా పాదయాత్ర చేసి, వైసీపీ పార్టీని ప్రజలలో నిలబెట్టారు. చరిత్ర సృష్టించారు. ఇంత దూరం పాదయాత్ర చేయాలంటే ఎంతటి ఉక్కు సంకల్పం ఉండి ఉండాలి? ఎంతటి వాగ్ధాటి, సమయస్ఫూర్తి ఉండి ఉండాలి? అయితే, ఆ పాదయాత్ర తనకోసం కాదు. తన అన్న కోసం. తన అన్న పార్టీని నిలబెట్టడం కోసం.

కానీ, ఈసారి తన కోసం, తన పార్టీ కోసం, తన లక్ష్య సాధన కోసం. ఇక, మరెంత ఉక్కు సంకల్పంతో పాదయాత్రకు ఆవిడ సమయత్తమవుతారో చెప్పాల్సిన పనిలేదు.

ముఖ్యమంత్రి కేసీఆర్‌ను, ఆయన పార్టీ టి.ఆర్.ఎస్.ను ఎదుర్కొనడానికి ఒకపక్క బీజేపీ మరోపక్క కాంగ్రెస్ జెండాతో రేవంతరెడ్డి సమాయత్తమవుతూ ఉండగా... 'ఇదిగో...! నేను వస్తున్నాను. కాచుకోండి!' అన్నట్టుగా షర్మిల రంగ ప్రవేశం చేశారు. ఇక ముందు ఆవిడ వై.ఎస్.షర్మిల కాదు. టి.ఎస్ (తెలంగాణ స్టేట్) షర్మిల.

ఆవిడకు.., వై.ఎస్ తనయకు శుభం జరగాలని కోరుకుందాం. తెలంగాణ వారి కోడలే అయినా... మన బిడ్డే కదా!

**- భోగాది వేంకట రాయుడు**

bv rayudu @ YouTube




# తేజస్విని హత్య దారుణం

## న్యాయం జరిగేంత వరకూ పోరాటం

**- ఐక్యవేదిక నాయకుల కొవ్వొత్తుల ప్రదర్శన**



ఇటీవల చోటుచేసుకున్న విషాద ఘటనలో హత్యకు గురైన తేజస్విని కుటుంబానికి న్యాయం జరిగేంత వరకూ పోరాడుతామని ఐక్య వేదిక నాయకులు, మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. ఈ నెల 3వ తేదీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించి తేజస్వినికి అశ్రునివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు పట్టణంలో పట్ట పగలు ఇంట్లోకి జొరబడి బీటెక్ విద్యార్థిని తేజస్వినిని హతమార్చడం దారుణమన్నారు. ప్రభుత్వం 'దిశ' చట్ట రూపం దాల్చకముందే దిశ పోలీస్‌స్టేషన్లు, దిశ బైక్, దిశ యాప్‌లంటూ హోరెత్తిస్తోందని, చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి షేక్ కాలేషా మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం డివిజన్ నాయకులు ఏ.కేశవులు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. వెంటనే దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పరిమళ వెంకటేశ్వర్లు, టీడీపీ తిరుపతి పార్లమెంటు మహిళా విభాగం ప్రధానకార్యదర్శి మట్టం శ్రావణి, జిల్లా కార్యదర్శి గుండాల భారతి, బీఎస్పీ నాయకులు నాశిన భాస్కర్‌గౌడ్, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు పల్లి కోటేశ్వరరావు, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీస్ యునైటెడ్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు వేగూరు విజయ్‌కుమార్, ఇన్సాఫ్ కమిటీ డివిజన్ నాయకులు ఎండీ అన్వర్, ఐక్యవేదిక నాయకులు షేక్ హాషిమ్, ఎంఆర్‌పీఎస్ నాయకులు మందా రవి తదితరులు తేజస్విని హత్యకు కారకులైన దోషులకు కఠిన శిక్ష అమలు చేయాలని కోరారు. అనంతరం కొవ్వొత్తుల నిరసన చేపట్టి తేజస్విని మృతికి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. టీడీపీ నాయకులు బిల్లు చెంచురామయ్య, ఇజ్రాయెల్ కుమార్, ఆర్ఎస్ కే.సద్దాం, అలీభాయ్, రాజేష్, అలీ ముర్తుజ, మొబీన్, బీఎస్పీ నాయకులు మీజూరు సుబ్రమణ్యం, ప్రజా సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు ఎల్వీ.సుబ్బయ్య, ఇన్సాఫ్, ఈద్గాహ్ యూత్, హమ్ సంస్థల నాయకులు షేక్ జమాలుల్లా, కబీర్, జాకీర్, చాన్‌బాష, జమీల్, యస్థాని, నవాజ్ పాల్గొన్నారు.

## ఆంధ్ర మహిళా మండలి నిరసన



గూడూరు పట్టణంలో ఇటీవల చోటుచేసుకున్న తేజస్విని విషాదాంతంపై ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఆర్ రెడ్డి హాస్పిటల్స్ ప్రముఖ వైద్యులు డాక్టర్ రోహిణి మాట్లాడుతూ సభ్యసమాజం తలదించుకునేలా జరిగిన తేజస్విని మృతి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని, అటువంటి దుశ్చర్యలకు పాల్పడే నిందితులకు ప్రభుత్వం 'దిశ' చట్టం ద్వారా కఠినమైన శిక్షలు అమలుచేయాలని కోరారు. ఆంధ్రమహిళా మండలి ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు జీవనిరెడ్డి, స్నేహాలతారెడ్డి, జ్యోతి, విష్ణువందన తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో లయన్స్ సేవలు



గూడూరు 'ధర్మవ్యూహం' ప్రతినిధి లయన్ షేక్ రియాజ్‌అహ్మద్ మనవడు, లయన్ హనీష్ అహ్మద్ కుమారుడు షేక్ మహమ్మద్ హసన్ పుట్టినరోజును పురస్కరించుకొని ఈ నెల 3వ తేదీ లయన్స్‌క్లబ్ ద్వారా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. మున్సిపాలిటీ మరియు మైఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గూడూరులోని వృద్ధాశ్రమంలో కేక్ కట్‌చేసి పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షులు జగదీష్‌చంద్ర అధ్యక్షత వహించారు. నిర్వాహకుల కోరికమేరకు వృద్ధులు భోజనం చేసేందుకు మూడు టేబుల్స్, 10 కుర్చీలు ఆశ్రమానికి వితరణగా అందజేశారు. పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కాంతారావు, షేక్ రియాజ్‌అహ్మద్, మల్లెమాల మురళిరెడ్డి, మదనమేటి వెంకటరమణయ్య, కళ్యాణసాయి, రూపేష్‌రెడ్డి, ఆశ్రమ నిర్వాహకులు ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌ఛార్జ్ కమిషనర్‌గా చంద్రశేఖర్



గూడూరు పురపాలక సంఘ ఇన్‌ఛార్జ్ కమిషనర్‌గా ఎల్.చంద్రశేఖర్‌రెడ్డి ఈ నెల 5వ తేదీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌ఛార్జ్‌గా విధులు నిర్వర్తిస్తున్న రఘుకుమార్ ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో నాయుడుపేట కమిషనర్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డిని ఉన్నతాధికారులు ఇన్‌ఛార్జ్‌గా నియమించారు.



గూడూరు అర్బన్ తొలి మహిళా సిఐగా ఈ నెల 5వ తేదీన బాధ్యతలు చేపట్టిన నాగేశ్వరమ్మకు స్వాగతం పలుకుతున్న వన్ టవున్ ఎస్సై వి.బ్రహ్మానాయుడు.

# సరైన పద్ధతిలో మాస్కు ధరించాలి

**డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి**

ప్రస్తుతం ఈ కరోనా కష్టకాలంలో కోవిడ్ వైరస్ నుంచి రక్షణ పొందేందుకు మాస్క్ ధరించడం ఎంతో ముఖ్యమని, ఇది మనకు మంచి రక్షణ కలిగిస్తుందని, అయితే ప్రతి ఒక్కరూ సరైన పద్ధతిలో మాస్కు ధరించాలని డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి అన్నారు. ఇటీవల నెల్లూరులోని తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ చాలా మంది మాస్కు ధరిస్తున్నారే కానీ దానిని సక్రమంగా ధరించడం లేదని, అందువల్ల మాస్కు ఎలా ధరించాలో ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కలిగిస్తున్నామన్నారు. 'మాస్కే రక్షణ కవచం' అనే నినాదంతో ఈనెల 5 నుంచి మూడు రోజుల పాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. సరైన మాస్కు, సరైన విధంగా ధరిస్తేనే కోవిడ్ నుంచి సరైన రక్షణ ఉంటుందన్నారు. మాస్కు పెట్టుకోవడంతో పాటు కోవిడ్ నిబంధనలన్నీ కూడా అందరూ తప్పనిసరిగా పాటించాలని, భౌతిక దూరం పాటించడం, చేతులు శుభ్రం చేసుకోవడం తదితరాలన్నీ ఎంతో ముఖ్యమని అన్నారు. మూడోవేవ్ ప్రబలకుండా అందరూ అప్రమత్తంగా ఉంటూ ప్రభుత్వ నిబంధనలు పాటించి కోవిడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు.

# అరటి గెలల మాటున ఎర్రచందనం రవాణా

ఎర్రచందనం అక్రమరవాణాను అరికట్టేందుకు అధికారులు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నా, వాటిని రవాణా చేసేవారు రకరకాల ఎత్తులు వేస్తూ తమ పని తాము చేసుకుపోతున్నారు. ఈ నేపథ్యంలో అరటి గెలల మాటున అక్రమంగా ఎర్రచందనాన్ని తరలిస్తున్న ఇద్దరు నిందితులు అటవీ అధికారులకు దొరికిపోయారు. వారి వద్ద నుంచి సుమారు 2లక్షల రూపాయలు విలువ చేసే 12 ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై ఆత్మకూరు అటవీశాఖ రేంజర్ పి.హరి మాట్లాడుతూ కడపజిల్లా నుంచి నెల్లూరుకు అరటికాయల లోడ్‌తో వస్తున్న మినీ లారీని నెల్లూరుపాళెం చెక్‌పోస్టు వద్ద ఆకస్మికంగా తనిఖీ చేయగా ఈ అక్రమరవాణా బయటపడిందన్నారు. అరటి గెలల కింద ఎర్రచందనం దుంగలను దాచిపెట్టి అక్రమరవాణాకు పాల్పడుతున్నారన్నారు. వాహనంలో ఉన్న డ్రైవర్,



దుంగలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

మరో వ్యక్తి పారిపోయేందుకు ప్రయత్నించగా అటవీ సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నారన్నారు. నిందితులు తమిళనాడులోని వేలూరు జిల్లాకు చెందిన లోకనాథన్ మునివేల్, మరోవ్యక్తి తిరువణ్ణామలైకి చెందిన శంకరరామన్‌గా గుర్తించామని, వీళ్ళిద్దరూ వెలిగొండ అడవుల్లోంచి ఎర్రచందనం దుంగలను తీసుకొస్తున్నట్లు తేలిందన్నారు. ఈ తనిఖీలో అటవీశాఖ డిఆర్‌ఓ పిచ్చిరెడ్డితో పాటు చెక్‌పోస్ట్ ఇన్‌చార్జి బి.దొరసానమ్మ, చినవెంకటయ్య, వి.పెంచలయ్య తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# రెవెన్యూ సంఘానికి కొత్త కమిటీ

**- అధ్యక్షునిగా సూర్యనారాయణసింగ్ -**

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపిఆర్‌ఎస్‌ఏ) జిల్లాశాఖకు ఇటీవల కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నెల్లూరులోని కలెక్టరేట్ ఆవరణంలో ఉన్న ఆ సంఘం కార్యాలయంలో ఈ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా సూర్యనారాయణసింగ్ ఎన్నికయ్యారు. ఇప్పటిదాకా ఈ పదవిలో ఉన్న బిసి కార్పొరేషన్ జిల్లా అధికారి కృష్ణారావు ఉద్యోగ విరమణ పొందడంతో ఆ స్థానంలో సూర్యనారాయణసింగ్‌ను ఎన్నుకున్నారు. కాగా కార్యదర్శిగా అల్లంపాటి పెంచలరెడ్డి, కోశాధికారిగా డానియల్ పీటర్, ఉపాధ్యక్షురాలిగా బాలకోటమ్మ, నిర్వహణ కార్యదర్శిగా మురళి ఎన్నికయ్యారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం కొత్త, పాత అధ్యక్షులిద్దరినీ అందరూ ఘనంగా సన్మానించారు.

# పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్‌గా సుధాకర్‌రావు

నెల్లూరు వెంకటేశ్వరపురంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా సుధాకర్‌రావు ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటిదాకా ప్రిన్సిపాల్‌గా పనిచేసిన రామ్మోహన్‌రావు గతనెల 30న ఉద్యోగ విరమణ పొందడంతో, ఆ స్థానంలో సుధాకర్‌రావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా కారణంగా గత మే 5 నుంచి 8వ తేది దాకా జరగాల్సిన పరీక్షలు వాయిదా పడ్డాయని, ఆ పరీక్షలను ఈనెల 12 నుంచి 17వ తేది వరకు నిర్వహిస్తామని తెలిపారు.

# కిసాన్‌మోర్చాకు కొత్త కార్యవర్గం

**- అధ్యక్షుడిగా బుజ్జిరెడ్డి**

భారతీయ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా కె.బుజ్జిరెడ్డి నియమితులైనట్లు బిజెపి జిల్లా నేత భరత్‌కుమార్‌యాదవ్ తెలిపారు. కిసాన్‌మోర్చా జిల్లా కమిటీని ఆయన ఇటీవల ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా గున్నం ప్రసాద్‌రెడ్డి, హజరత్తయ్య, రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా వినయ్ నారాయణ, గాదిరాజు చక్రవర్తి, కార్యదర్శులుగా మేకపాటి మాల్యాద్రినాయుడు, సయ్యద్ షకూర్, అల్లూరు మల్లికార్జునసింగ్, అనిత, కేతిరెడ్డి విష్ణుతేజ, పముజుల సురేష్, కోశాధికారిగా పి. మోహన్‌లతో పాటు జిల్లా కార్యవర్గసభ్యులుగా సత్యవోలు శేషారెడ్డి, దాచూరు వెంకటేశ్వర్లు నియమితులయ్యారన్నారు.

# సోమశిల ఎస్‌ఇగా రమణారెడ్డి



సోమశిల ప్రాజెక్టు ఎస్‌ఇగా వివి రమణారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాపూరులో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న రమణారెడ్డి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఎస్‌ఇగా బాధ్యతలు చేపట్టారు. మొన్నటిదాకా ఆయన రాపూరులో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేశారు. కొత్త ఎస్‌ఇకి పలువురు ఇంజనీర్లు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

# కంటిచూపు

నాకు స్వేచ్ఛ తోడు కావాలి
నాకు రక్షణ నీడ కావాలి
గగనతలంలో గువ్వలా ఎగరాలి
అరణ్యాల హరిణిలా పరుగులెత్తాలి
చేపపిల్లలా నీటిలో తిరుగాడాలి
అలనై ఆవలి ఒడ్డుకు పరుగుతీయాలి
కలగా లోకమంతా విహరించాలి
వాయువునై ఆకాశయానం గావించాలి
ప్రతిఘటనే పరమావధిగా –
ఆంగ్లేయుల్ని తరిమికొట్టినప్పటి స్వేచ్ఛ
తిరుగుబాటు సమరంతో –
స్వాతంత్ర్యానుభూతిని
గుండెల్లో నింపుకొన్నప్పటి స్వేచ్ఛ
కలరా ప్లేగుల్ని మట్టుపెట్టినప్పటి జీవన స్వేచ్ఛ
స్వేచ్ఛా కవచాన్ని తొడుక్కొని
పరుగులిడే స్వేచ్ఛ
సమూహంలో సమూహమై, జన ప్రవాహంలో
ప్రవాహమై విలయాల్ని దాటే స్వేచ్ఛ...!
అన్ని వలయాల్ని ఛేదించి
స్వేచ్ఛాయుత జీవనమే
ఆలంబనమైన స్వేచ్ఛ కోసం
నా ఎదురుచూపు!
స్వేచ్ఛే నా కంటిచూపు!!



**చిన్ని నారాయణరావు**
9440202942

# నెల్లూరులో అపురూపమైన.. శ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయం

***సాక్షాత్తూ దత్తాత్రేయస్వామి అవతార రూపమే.. శ్రీ షిరిడీ సాయిబాబా. మనిషిలో మానవత్వం.. ఎల్లెడలా సర్వమత సమానత్వం విరాజిల్లాలని ఆకాంక్షిస్తూ తన బోధనలతో లోకాన్ని ప్రభావితం చేసిన భగవదవతార రూపమే శ్రీ సాయిబాబా. అందుకే ఆ కారణ జన్ముడికి భారతావని అంతటా ఆలయాలున్నాయి. దేశవ్యాప్తంగా సాయి భక్తులు బాబాకు గుడులు కట్టి పూజలు చేసి తరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అందరి దేవునిగా, అందరికీ ఇలవేలుపుగా మారిన శ్రీ షిరిడీనాథుని దేవాలయం నెల్లూరులో కూడా ఉంది. అయితే, సాయిభక్తుడు కాక.. ఓ అయ్యప్పస్వామి భక్తుడు.. సాయిబాబాకు అత్యద్భుతమైన ఆలయం కట్టించడం ఇక్కడి విశేషం. నెల్లూరు గాంధీనగర్‌లో ఉన్న ఈ దేవాలయానికి ఆసక్తికరమైన చరిత్ర కూడా ఉంది.***

ప్రేమ, దయ, క్షమ, కరుణ వంటి సుగుణాలతో మానవాళి సుఖసంతోషాలతో ఉండాలని, 'శ్రద్ధ–సహనం'తో అందరూ కలసిమెలసి జీవించాలని, ఆకలిగొన్నవారికి అన్నం పెట్టాలని, సత్యధర్మ నిష్టలతో, భక్తిభావం..సేవాభావంతో జీవిస్తూ మానవాళి అంతా జీవితాలను సార్ధకం చేసుకోవాలని బోధించిన మహనీయుడు శ్రీ షిరిడీ సాయిబాబా. అంతేకాదు, తన అద్వితీయమైన మహిమలతో రోగుల బాధలు తానే స్వీకరించి, భక్తుల బాధలు తీర్చిన మహామహిమాన్వితుడు శ్రీ సాయిబాబా. అందుకే ఊరూరా ఆయనకు ఆలయాలున్నాయి.

## ఆలయ చరిత్ర :

నెల్లూరు నడిబొడ్డులోని గాంధీబొమ్మ కూడలి వద్ద గాంధీనగర్‌లో ఉన్న శ్రీ షిరిడీ సాయిబాబా మందిరం ఎంతో అపురూపమైనది. నగరంలో సుమారు 65 ఏళ్ళ క్రితం అయ్యప్ప స్వామి భక్తుడైన డాక్టర్ ఎం.కె రాజగోపాలాచారికి బాబావారు అయ్యప్పస్వామిగానే దర్శనమివ్వడంతో ఆయన శ్రీ షిరిడీనాథుని





**మన దేవాలయాలు 55**

చిత్తరువును తన నివాసంలో పెట్టుకుని పూజలు చేసేవారు. సాయిభక్తులంతా వచ్చి సాయినాథుని దర్శించుకునేవారు. ఆ తర్వాత 1956 ప్రాంతంలో సాయిభక్తమండలి ఆధ్వర్యంలో సాయినాథునికి ఆలయం నిర్మించేందుకు రాజగోపాలాచారి ద్వారా ఆలయానికి స్థలాన్ని కొనుగోలు చేసి గాంధీనగర్‌లో ఆలయ నిర్మాణం ప్రారంభించారు. అనతికాలంలోనే భక్తులు, దాతలందరి సహకారంతో అత్యద్భుతమైన రీతిలో సాయినాథుని దేవాలయం నిర్మించి శ్రీ సాయినాథుని విగ్రహమూర్తిని ప్రతిష్ఠించారు. 1959 అక్టోబరు 22వ తేదిన శ్రీ షిరిడీ సాయిబాబా విగ్రహప్రతిష్ఠ మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. నాటి నుంచి నేటిదాకా ఆలయ మందిరం కమిటీ నిర్వాహకులు, శాశ్వత సభ్యుల సారధ్యంలో ఆలయం దినదినప్రవర్ధమానమవుతూనే ఉంది. తొలుత ఆ భక్తుని నివాసంలో ఉన్న సాయినాథుని భారీ చిత్తరువును కూడా ఉంచి నేటికీ పూజలు చేస్తూనే ఉన్నారు. కాలక్రమంలో సాయిభక్తులు, దాతలు లక్షలాది రూపాయలు వెచ్చించి ఆలయాన్ని మరెంతగానో అభివృద్ధి చేశారు. 1995లో ఆలయ నిర్వాహకులు ఎంతో ఘనంగా మహాకుంభాభిషేకం, శిఖరప్రతిష్ట ఉత్సవాలు కూడా నిర్వహించారు.

### అరుదైన జంట గోపురాలు



ఈ ఆలయం సాయి దేవాలయాల్లో ఎంతో అరుదైన ఆలయంగా ప్రతీతి. కేరళ సంప్రదాయ నేపథ్యంలో ఆలయ నిర్మాణం అద్వితీయంగా జరిగింది. ఆలయ ప్రధానమందిరంపై అద్భుతంగా నిర్మించిన జంటగోపురాలు ఇక్కడి ప్రత్యేకత. స్వాగత ద్వారంపై సాయినాథుని విగ్రహం భక్తులను ఇట్టే ఆకర్షిస్తుంటోంది. గర్భగుడిలో సమున్నతపీఠంపై కొలువైవున్న సాయినాథుని విగ్రహమూర్తి జీవకళతో నయనానందకరంగా ఉంటుంది. విశాలమైన సాయి ధ్యానమందిరం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఆలయంలో నెలకొల్పిన శ్రీ సాయినాథుని దివ్య చరిత్రను కళ్ళముందు నిలిచేలా రూపుదిద్దిన చిత్తరువులు అందరినీ భక్తిభావ సమన్వితులను చేస్తుంటాయి. అన్నం పరబ్రహ్మ స్వరూపంగా, అదే ఆ పరమాత్మ ఆరాధనగా భావించి శ్రీస్వామి వారి బోధనలను భక్తిశ్రద్ధలతో అనుసరిస్తూ ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో ప్రతి గురువారం భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతూ ఉంటుంది. ఆ సద్గురుదేవుని సేవించుకునేందుకు నిత్యం ఎంతోమంది భక్తులు ఆలయానికి వచ్చి ఆ దివ్యదేవుని దర్శించుకుని తరిస్తుంటారు. ఇటీవలి కాలంలో ఆలయంలో మరెంతో వైభవంగా జరిగే గురుపూజోత్సవాలకు, విశేషపుష్పాలంకరణలకు పెద్దఎత్తున భక్తజనులు తరలివస్తుండడం విశేషం.

# జిల్లా జనసేన నేతగా.. మనుక్రాంత్



జనసేన పార్టీ నెల్లూరుజిల్లా శాఖ అధ్యక్షుడిగా చెన్నారెడ్డి మనుక్రాంత్ నియమితులయ్యారు. జనసేన రాష్ట్ర అధికారప్రతినిధిగా, రాజకీయవ్యవ హారాల కమిటీ సభ్యునిగా ఉన్న మనుక్రాంత్‌కు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఆ పార్టీ నాయకులు సుజయ్‌బాబు, గునుకుల కిషోర్, కొట్టె వెంకటేశ్వర్లు తదితరులు సంతోషం వ్యక్తం చేశారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు తమ ధన్యవాదాలు తెలిపారు.

# రాంగ్ ట్రాక్‌పై ర్యాంప్‌వాక్

(మొదటి పేజీ తరువాయి)

చేస్తోందో వేరే చెప్పక్కర్లేదు. అదే యేడాది లెక్కల ప్రకారం మన దేశంలో 1600 శాటిలైట్ ఛానెళ్ళు రిజిస్టర్ కాబడితే వాటిలో 400 న్యూస్ ఛానెళ్ళు. ఈ మూడేళ్ళలో ఆ సంఖ్య ఇంకెంత పెరిగిందో తాజా గణాంకాలలో తేలాల్సిందే.

ఒకప్పుడు సమాజ శ్రేయస్సే ధ్యేయంగా, ప్రజలకు – ప్రభుత్వాలకు మధ్య వారధిగా నిస్వార్థంగా పనిచేసిన మీడియా ఇప్పుడు, గోడమీద నుండి అంతరిక్షానికి చేరి క్షణం క్షణం పోటీపడుతూ విలువలకు వలువలు వలిచి విచ్చలవిడిగా చెలరేగిపోతోంది. ఎలక్ట్రానిక్ ఛానెళ్లు, సామాజిక మాధ్యమాలు ఇబ్బడి ముబ్బడిగా అవతరించి ఎవరికి వారు తమ తమ ప్రాధాన్యతలను, ప్రాముఖ్యతలను నిర్దేశించుకుని అంగట్లో సరుకు లాగా తమ సంస్థలలో వచ్చే వార్తలను బేరానికి పెట్టి పబ్బం గడుపుకుంటున్నారు. ఒక్కొక్క మీడియా సంస్థ ఒక్కొక్క రాజకీయపార్టీకి బాకా కొడుతూ... మీడియా ప్రయోజనాలను తుంగలో తొక్కుతున్నాయి. రాజకీయపార్టీలు సైతం తమ ప్రాభవం కోసం తమ డబ్బా తామే కొట్టుకోవడానికన్నట్లు స్వంత ఛానెళ్ళు, పత్రికలు పెట్టేసుకొని తమ వార్తలు తామే రాసేసుకుంటున్నాయి. కొన్ని రాజకీయపార్టీలైతే అప్పటికే పాపులారిటీని పొందిన ఛానెళ్ళను వందల కోట్లు పోసి కొనేస్తున్నాయి.

ఇక సామాజిక మాధ్యమాలైతే... ఉచ్చం నీచం మరచి మరీ రెచ్చిపోతున్నాయి. అపరిమితమైన బూతు పురాణాలలో ఒకటికొకటి పోటీపడుతున్నాయి. ఈ ట్యూబ్ , ఆ ట్యూబ్, ఏ ట్యూబ్, యు ట్యూబ్ అంటూ రకరకాల సామాజిక ఛానెళ్ళను వేదికలుగా చేసుకుని వార్తలు, వ్యాఖ్యలు, విశ్లేషణలు, వివరణల పేరుతో జాతర చేస్తున్నాయి.

## చర్చల పేరుతో రచ్చలు

మన తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే, రాష్ట్ర స్థాయిలో దినపత్రికలు నడిపే ప్రధాన పత్రికా యాజమాన్యాలన్నీ సొంత ఛానెళ్లను కూడా ఏర్పాటు చేసేసుకున్నాయి. అటు తెలంగాణలోనూ ఇటు ఆంధ్రాలోనూ ప్రస్తుతం అధికారంలో ఉన్న రెండు పార్టీలకు వారివారి పత్రికలు, ఛానెళ్ళు ఉండనే ఉన్నాయి. వాటికి పోటీగా ప్రతిపక్ష పార్టీలకు వత్తాసు పలుకుతూ మరికొన్ని ఛానెళ్ళు, పత్రికలు తమ పని తాము చేసుకు పోతున్నాయి.

ఇప్పటికే రెండుపదులకుపైగా తెలుగు వార్తా ఛానెళ్ళు తెలుగు ప్రజల టీవీలలో దర్శనమిస్తున్నాయి. తరచూ సమాజంలో జరిగే సంఘటనలు, అరుదుగా సంభవించే ఘటనలు చూపించడంలో అందరిదీ దాదాపుగా ఒకే బాణీ అనే చెప్పవచ్చు. అయితే రాజకీయ వార్తలు, విశ్లేషణలు, చర్చలు జరిగేటప్పుడు మాత్రం వీరి ధోరణి మారిపోతోంది. యాంకర్ల వైఖరి విచిత్రంగా కనిపిస్తోంది. తాము ఏం చెప్పాలనుకున్నామో తమ ఛానెల్ ఎవరికి మద్దతు పలకాలనుకుంటోందో అది అవతలి వారి చేత చెప్పించే వరకు వీళ్ళు వదలరు. ఒకవేళ తాము అనుకున్న లక్ష్యం తప్పుదోవ పడుతుందన్న అనుమానం వస్తే చర్చలో పాల్గొనే వ్యక్తుల మధ్య వీళ్ళే చిచ్చు పెట్టేస్తారు. ఒకళ్ళ మధ్య ఒకరికి గొడవలు వచ్చేలా వీళ్ళే రెచ్చగొట్టి చర్చను రసాభాస చేసేస్తారు.

రోజూ దినపత్రికలలో వచ్చే వార్తలపైన ఒక చర్చ. ముందురోజు రాజకీయ నాయకులు చేసిన కామెంట్ పైన మరొక చర్చ, ప్రభుత్వ పథకాలపైనా, కోర్టు తీర్పులపైనా, నీటి గొడవలపైనా, షర్మిల పార్టీపైనా, జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిత్వం పైనా, కేసిఆర్ ఫామ్‌హౌస్‌పైనా, పవన్‌కళ్యాణ్ పెళ్ళిళ్ళపైనా, కత్తి మహేష్‌కి ఆంధ్రా ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సహాయం పైనా, అమరావతి ఉద్యమం పైనా, హైదరాబాదులో వానపైనా, కాశ్మీరులో మంచుపైనా, ఆనందయ్య మందుపైనా, చివరికి పది కోట్లమంది ఉన్న తెలుగు రాష్ట్రాల ప్రజలలో కేవలం 1000 మందికి పరిమితమైన సినీ'మా' అసోసియేషన్ ఎన్నికలపైన కూడా చర్చే. 'వార్తకు కాదేదీ అనర్హం' అని ఓ మేధావి చెప్పినట్లుగా, 'చర్చకు కాదేది అనర్హం' అన్నట్లుగా నేటి మీడియా ఛానెళ్ళు వ్యవహరిస్తున్నాయి.

## 'మీడియేటర్'గా మారిపోతున్న మీడియా

ఒకప్పుడు మీడియా అంటే గౌరవం, జర్నలిస్టు అంటే అదొక హోదా. పత్రికా రంగంలో పనిచేయడం అంటే గొప్ప. ఇప్పుడు పరిస్థితి అది కాదు, మీడియాకు మీనింగే మారిపోయింది. ఇప్పుడు మీడియా సోదరులంతా మీడియేటర్లుగా మారిపోయారు. తమ తమ యాజమాన్యాల స్వార్థపూరిత ధోరణిని నిలదీయలేక వాళ్ళూ తమ దారులు వెతుక్కుంటున్నారు. ప్రజా ప్రయోజనాలను తుంగలో తొక్కి స్వప్రయోజనాలకు ప్రాధాన్యత కల్పించుకుంటున్నారు. ఇప్పుడు మీడియాకు విలువ లేదు, మీడియాలో వచ్చే వార్తలకు నిబద్ధత లేదు, మీడియాపైన ప్రజలకు విశ్వసనీయత లేదు.

ఫ్యాషన్ షోలలో మొదటి స్థానం సంపాదించడానికి తమ అందాలను ప్రదర్శించి వగలుపోతూ రాంప్‌వాక్ చేస్తారు అందాల భామలు. ఇక్కడ తమ ఉనికిని ప్రదర్శించడానికి రాంగ్‌ట్రాక్‌లో ర్యాంప్‌వాక్ చేస్తోంది మీడియా. ఇదే వైఖరి కొనసాగితే రాబోయే కాలంలో మీడియాకి మనుగడే లేదు..!

# వైఎస్ పుట్టినరోజు..
# రాష్ట్రానికే పండుగరోజు



- ఊరూరా సంబరాలు... వాడవాడలా వేడుకలు
- 63 మందికి వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాలు

*మహానేత, రైతుబాంధవుడు, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని జులై 8ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'వైఎస్సార్ రైతు దినోత్సవం'గా, ఒక పండుగలా జరుపుకుంది. ఆ మహానేత పుట్టినరోజు రాష్ట్రానికే పండుగరోజు అన్నట్లుగా ఎక్కడ చూసినా ఆనందోత్సాహాలతో ఆయన జయంతి కార్యక్రమాల సందడి ఒక పెద్ద సంబరంలా జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా వాడవాడలా ఆ మహానేతను స్మరించుకుంటూ ఎన్నో కార్యక్రమాలు జరిగాయి.*

దివంగత మహానేత డా.వైఎస్ పుట్టిన రోజు సందర్భంగా ఈనెల 8న వ్యవసాయ రంగం, దాని అనుబంధ రంగాల్లో విశేష కృషి చేస్తున్న అభ్యుదయ రైతులకు, వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న పలువురికి ఎంతో ప్రతిష్టాత్మకమైన డా.వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాలను ప్రకటిం చారు. రాష్ట్రంలోని పలు సంస్థలు, పలు వురు రైతులు, కళాకారులు, రచయితలు, పాత్రి కేయులతో పాటు, కోవిడ్ కష్ట కాలంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు వైద్యసేవలందించిన పలువురు వైద్య సిబ్బందిని 'కోవిడ్ వారియర్స్'గా అభినం దించి వారికి కూడా ఈ ఘనమైన పుర స్కారాలను అందజేయనున్నారు. ఈ జీవిత సాఫల్య పురస్కారానికి 10లక్షల రూపా యల నగదుతో పాటు, జ్ఞాపిక అందజే స్తారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాలు ఈసారి 63 మందికి లభించడం ఎంతో విశేషం. ఈ అవార్డులను ఆగస్టు 14 లేదా 15 తేదీల్లో అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

## రాష్ట్రంలో వెల్లువెత్తిన ప్రగతి పనులు

వైఎస్ జయంతి సందర్భంగా ఈనెల 8న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు ప్రారంభ మయ్యాయి. దాదాపు 1570 కోట్ల రూపాయలకు పైగా వ్యయంతో ప్రగతి పనులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరి గాయి. అనంతపురం జిల్లాలోని రాయ దుర్గంలో రాష్ట్రస్థాయి రైతు దినోత్సవంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను, రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

## ప్రముఖ రంగస్థల నటుడు పొన్నాల రామసుబ్బారెడ్డికి వైఎస్సార్ జీవితసాఫల్య పురస్కారం



ఎంతో ప్రతి ష్టాకరమైన డా. వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కా రాలు నెల్లూరు జిల్లాలోనూ పలు వురు విశిష్టవ్యక్తులకు లభించాయి. మన జిల్లా నుంచి ఈ పురస్కారాలు అందుకున్న వారిలో ప్రముఖ రంగస్థల నటుడు, హంస అవార్డు గ్రహీత పొన్నాల రామసుబ్బారెడ్డి ఒకరు. అటు పౌరాణికం, ఇటు సాంఘిక నాటకాల్లోనూ ఆయన నటనా కౌశలం అమోఘం. నాటకరంగంలో నెల్లూరు కీర్తిని దశదిశలా చాటుతున్న ఆయన్ను ఇప్పటికే ఎన్నో అవార్డులు వరించాయి. ఎన్నెన్నో ఘనసన్మానాలు జరిగాయి. సత్య హరి శ్చంద్రునిగా, భక్తరామదాసుగా, నలమహా రాజుగా ఇలా ఆయన ఎన్నో పౌరాణిక పాత్రల్లో విలక్షణమైన నటనతో రాణించి ఖ్యాతి చెందారు. 1932లో నెల్లూరు సమీపంలోని పొట్టేపాళెం గ్రామంలో ఆయన జన్మించారు. రెవెన్యూశాఖలో ఉద్యోగిగా చేరి, డెప్యూటీ తహశీల్దారుగా ఉద్యోగ విరమణ చేశారు. బాల్యం నుంచి నటనపై ఆసక్తితో నాటకరంగంలోకి వచ్చి నిరంతర కృషితో ఎదిగి నాటకరంగంలో తనదైన ముద్ర వేసుకున్నారు. ఇప్పుడా యనకు దాదాపు 90 ఏళ్ళు. వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారం లభించడంతో తనకెంతో అరుదైన గౌరవం లభించిందని ఆయనెంతగానో సంతోషిస్తున్నారు. తన జీవితంలో ఇన్నేళ్ళపాటు నాటకరంగంలో పడిన కష్టానికి తగ్గ గుర్తింపు లభించిం దంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## మరికొందరికి పురస్కారాలు

నెల్లూరు జిల్లాకు చెందిన రైతు శివ అభిరామరెడ్డి, వెంకటగిరి చేనేత కళా కారుడు జి.రమణయ్య, కోవిడ్ వారి యర్స్‌లో నెల్లూరులోని పల్మనాలజీ ప్రొఫెసర్ డాక్టర్ నీతిచంద్ర, ఎం.యోబు ఉత్తమసేవలకు గుర్తింపుగా ఎంతో విశిష్ట మైన వైఎస్సార్ జీవితసాఫల్య పురస్కా రాలకు ఎంపికయ్యారు.

## పాత్రికేయరంగంలో

రాష్ట్రవ్యాప్తంగా పత్రికా రంగంలో విశేష సేవలందిస్తున్న పలువురు పాత్రికే యులకు వైఎస్సార్ జీవితసాఫల్య పురస్కా రాలను ప్రకటించారు. దివంగతులైన ప్రముఖ పాత్రికేయులు పొత్తూరి వెంక టేశ్వరరావు, షేక్ ఖాజాహుస్సేన్ (దేవి ప్రియ), కె.అమర్‌నాథ్ (పశ్చిమ గోదావరి జిల్లా)లకు కూడా ఈ పురస్కారాలను ప్రకటించారు. పాలగుమ్మి సాయినాథ్ (చెన్నై), ఏబికె ప్రసాద్(కృష్ణాజిల్లా), సురేంద్ర, (కార్టూనిస్టు-కడప), తెలకపల్లి రవి(కర్నూలు), ఇమామ్(అనంతపురం)లు ఈ జీవితసాఫల్య పురస్కారాలను అందు కోనున్నారు.



చిరస్మరణీయ దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి 72వ జయంతి సందర్భంగా జులై 8వ తేదీ గురువారం నెల్లూరులోని వైయస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి.

## వాత్సల్యలో ఎల్వీకే సేవలు



మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా ఈ నెల 8వ తేదీ గురువారం ఉదయం నెల్లూరులోని వాత్సల్య శరణాలయానికి చెందిన విద్యార్థు లకు, వృద్ధులకు విక్రమ సింహపురి యూని వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.విజయకృష్ణా రెడ్డి తమ ట్రస్టు తరపున అల్పాహారాన్ని అందజేసి ఆ మహానేత పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు.

# మూగబోయిన.. సామాజిక సేవాగళం

## జేవీ రమణారెడ్డి మృతితో ప్రముఖుల విచారం

**ఆయనో ఉద్యమస్ఫూర్తి. సామాజిక సేవా దీప్తి. ఐఏఎస్, ఐపిఎస్‌లకు కూడా మార్గదర్శి. చైతన్యవంతమైన విధానాలతో సమాజానికి అమూల్యమైన సేవలందించిన సంస్కరణాభిలాషి. ఆయనే జేవీ రమణారెడ్డి. కోట మండలంలోని వంజివాక గ్రామంలో జన్మించిన ఆయన జీవితాంతం సామాజిక సేవా కార్యక్రమాలతోనే గడిపి అందరికీ స్ఫూర్తిదాయకమయ్యారు. 83 ఏళ్ళ వృద్ధాప్యంలో అనారోగ్యంతో తిరుపతిలో మృతిచెందిన రమణారెడ్డికి జిల్లాలోని అనేకమంది సామాజికవేత్తలు, ప్రముఖులు, ప్రజలు నివాళులర్పించారు. ఆయన మృతి జిల్లాను శోకతప్తం చేసింది.**



జేవీ రమణారెడ్డి అంటే జిల్లాలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా ఎందరికో సుపరిచితులు. పేదల అభ్యున్నతికి, సమాజ అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన సమాజ సేవాభిలాషి ఆయన. ఎంతో నిబద్ధత, సేవాభావంతో పనిచేసి అందరికీ మార్గదర్శకమయ్యారు. ఎన్‌సిఇఆర్టీ డెప్యూటి డైరెక్టర్‌గా ఉద్యోగం చేస్తున్నప్పుడు పాఠ్య పుస్తకాల రూప కల్పనలో ఆయన చేసిన కృషి అపూర్వం. గత ప్రభుత్వాల హయాంలో అనేక సంక్షేమపథకాల రూప కల్పనలో ఆయన పాత్ర కీలకం. ఆయనెంతో ఉదారుడు.. సహృదయుడు.. సౌజన్యమూర్తి కూడా. పేద విద్యార్థులు, బడుగు బలహీనవర్గాల విద్యార్థుల చదువులకు ఎంతో సాయం చేసేవారు. ఆయన సాయం పొందిన వారెందరో ఐఏఎస్, ఐపిఎస్, ఐఆర్‌ఎస్‌లుగా కూడా ఉన్నారంటే అతిశయోక్తి కాదు. గతంలో పేరొందిన ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్, గద్దర్ తదితరులతో కలసి ఆయనెన్నో సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మహానేత డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వానికి నక్సలైట్లకు మధ్య చర్చలు జరిపేందుకు ఎస్ఆర్ శంకరన్ సారథ్యంలో ఏర్పాటైన శాంతికమిటీలో కూడా ఆయన సభ్యుడుగా ఉండి చర్చలు సఫలం కావడానికి ఎంతగానో కృషి చేశారు. ఆ తర్వాత కాలంలో రాష్ట్ర విభజనను తీవ్రంగా వ్యతిరేకిస్తూ పలు పుస్తకాలు వెలువరించడమే కాక వేలాది కరపత్రాలతో ప్రజలను చైతన్యవంతం చేశారు.

### పేదలకు ఆత్మబంధువు

తొలి నుంచి ఆయన పేదలకు ఆత్మబంధువుగా ఉంటూ వారికి అన్నివిధాలా సాయం చేస్తుండేవారు. 2002లో ఉద్యోగ విరమణ చేసిన తర్వాత గూడూరు పక్కనున్న కొమ్మనేటూరు గ్రామంలో ఎస్ఆర్ శంకరన్ పేరుతో గ్రామీణ చైతన్య కేంద్రం పెట్టి పేదలకు విద్య, వైద్యం అందించేవారాయన. ఆ తర్వాత దీనికి అనుబంధంగా ఒక పెద్ద వ్యవసాయక్షేత్రాన్ని కూడా ఏర్పాటుచేసి వందలాదిమంది దళితులకు ఉపాధి కల్పించి అందరి ఆదరాభిమానాలను పొందారు. జీవితాంతం పేదలకు, బడుగు బలహీనవర్గాల వారి అభ్యున్నతికి శ్రమించిన జేవీ రమణారెడ్డి మృతి సమాచారం తెలిసి జిల్లాలోనే కాక, రాష్ట్రంలోని అనేకమంది పేదలు, దళితులు ఆవేదనకు గురయ్యారు. ఆయన సేవాభావాన్ని తలుచుకుని ఎంతోమంది కన్నీరుపెట్టారు. ఏదేమైనా ఆయన మరణంతో ఒక ఉన్నతమైన సామాజిక సేవాగళం మూగబోయినట్లయింది. జిల్లా ఒక ప్రముఖ విద్యావేత్తను, విద్యాదాతను, సామాజిక సేవామూర్తిని కోల్పోయినట్లయింది. ఆయన అంత్యక్రియలు ఆయనకెంతో ఇష్టమైన కొమ్మనేటూరు దళితవాడలో జరిగాయి. పెద్దసంఖ్యలో ప్రజలు, ప్రముఖులు, అభిమానులు అశ్రునయనాలతో ఆయనకు కడసారి కన్నీటి వీడ్కోలు పలికారు.

---

## సంచలనం కలిగించిన

# తేజస్విని హత్యకేసులో నిందితుల అరెస్టు

### - అడిషనల్ ఎస్పీ వెంకటరత్నం వెల్లడి



గూడూరులో ఈనెల 1న తేజస్విని అనే విద్యార్థినిని అత్యంత దారుణంగా హతమార్చిన సంఘటన జిల్లాలోనే కాక, రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన విషయం తెలిసిందే. తన ప్రేమను తిరస్కరించిందనే భావంతో ఇంజనీరింగ్ చదువుతున్న యువతిని అత్యంత పాశవికంగా ఆ ప్రేమోన్మాది హతమార్చాడంటూ గూడూరులోని ప్రజాసంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు పెద్దఎత్తున ఆందోళన చేశాయి. అందరినీ భయాందోళనకు గురిచేసిన ఈ హత్య కేసులో నిందితులను ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 7న ఆ వివరాలను నెల్లూరులోని ఉమేష్‌చంద్ర హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అడిషనల్ ఎస్పీ వెంకటరత్నం విలేకర్లకు వెల్లడించారు. ప్రధాన నిందితుడు గులిశెట్టి వెంకటేశ్వర్లుతో పాటు నిందితులు చిట్టేటి పృథ్వీరాజ్, బండ్ల శివగా గుర్తించి వారిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. వెంకటేశ్వర్లు తండ్రి స్కూల్ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. తేజస్విని తల్లిదండ్రులు కూడా ఉపాధ్యాయులు కావడంతో ఈ రెండు కుటుంబాలకు ఏళ్లతరబడి పరిచయం ఉందని, ఈ నేపథ్యంలో వెంకటేశ్వర్లుకు, తేజస్వినికి గత ఆరేళ్ళుగా పరిచయమని, అయితే తేజస్వినితో తరచూ మాట్లాడుతుండడం ఇష్టం లేని తల్లిదండ్రులు గత రెండునెలలుగా తేజస్విని ఫోన్ నెంబరు మార్చడంతో కోపంతో రగిలిపోయిన వెంకటేశ్వర్లు, తనకు దక్కనిది మరొకరికి దక్కకూడదనే కర్కశమైన ఆలోచనతో తేజస్వినిని దారుణంగా హత్య చేసినట్లు ఏఎస్పీ తెలిపారు.

### సంఘటన ఇలా జరిగింది

మొదట తేజస్విని తల్లిదండ్రులు బయటకు వెళ్ళారని ఒకరు సమాచారం అందిస్తే, మరొకడు తేజస్విని క్లాస్‌మేట్‌గా తనకున్న పరిచయాన్ని ఉపయోగించుకుని తేజస్విని తన గది తలుపులు తెరిచేలా చేశాడు. ఇంతలోనే ప్రధాన నిందితుడు వెంకటేశ్వర్లు ఇంట్లోకి జొరబడి తేజస్వినిని బెడ్‌రూమ్‌లోకి లాక్కెళ్ళి తలుపులు గడియవేశాడు. తేజస్వినిని చంపాలనే ఉద్దేశ్యంతోనే వెంకటేశ్వర్లు తనతో తెచ్చుకున్న కత్తితో తేజస్విని మెడమీద పొడిచాడు కానీ ఆమె చనిపోలేదని మళ్ళీ గొంతులో పొడిచాడు. అప్పటికీ తేజస్విని చనిపోలేదని అత్యంత పాశవికంగా అక్కడున్న టవల్‌ను గొంతుకు చుట్టి బిగించి హత్యచేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈలోగా చుట్టుపక్కల వాళ్ళు, పోలీసులు అక్కడికి చేరుకోవడంతో వెంకటేశ్వర్లు ఆత్మహత్య చేసుకున్నట్లు నాటకం ఆడాడు. ఇద్దరినీ ఆసుపత్రికి తరలించగా తేజస్విని మరణించింది. వెంకటేశ్వర్లును నెల్లూరుకు తరలించారు. నెల్లూరులోని జిజిహెచ్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన వెంకటేశ్వర్లును వెంటనే అరెస్టు చేయగా, మిగిలిన ఇద్దరు నిందితులైన పృథ్వీ, శివలను గూడూరులో అరెస్ట్ చేయడం జరిగిందని ఏఎస్పీ వెల్లడించారు. ఈ సమావేశంలో గూడూరు డిఎస్పీ ఎం.రాజగోపాలరెడ్డి, గూడూరు రూరల్ సిఐ శ్రీనివాసులురెడ్డి, అర్బన్ సిఐ నాగేశ్వరమ్మ, ఎస్ఐలు బ్రహ్మనాయుడు, ఆదిలక్ష్మి, పోలీసు సిబ్బంది రాజు, నారాయణ పాల్గొన్నారు.

---

## ఎంపి ఆదాలతో..

# జిల్లా రైతు సంఘం నాయకుల భేటీ

### రైతుల బాధలు తీర్చాలంటూ విన్నపం



కొన్ని పవర్‌గ్రిడ్, ట్రాన్స్‌మిషన్ కంపెనీల వారు జిల్లాకు చెందిన రైతుల పొలాల్లో ఎక్కడంటే అక్కడ టవర్లు నిర్మిస్తూ, విద్యుత్ తీగలు వేస్తూ రైతుల పొలాలను, స్థలాలను చిత్తానుసారం ఆక్రమిస్తున్నారని, దీంతో రైతులు బాగా నష్టపోతున్నారని జిల్లాకు చెందిన పలువురు రైతుసంఘం నాయకులు నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. ఈనెల 6న జిల్లా రైతుసంఘాల సమాఖ్య ప్రతినిధులు చిరసాని కోటిరెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరులో ఎంపి ఆదాలను కలిశారు. ప్రభుత్వ చట్టాలను, ఉత్తర్వులను ఏమాత్రం ఖాతరు చేయకుండా రైతుల పొలాల్లో పెద్దపెద్ద టవర్లు నిర్మించడం, పొలాల మీదనే వైర్లు లాగడం చేస్తున్నారని, అందుకు సంబంధించి కనీసం న్యాయమైన నష్టపరిహారం కూడా రైతులకు ఇవ్వడం లేదని, ఈ అన్యాయాన్ని పరిశీలించి రైతులకు తగు న్యాయం చేయాలని వారు ఎంపిని కోరారు. ఈ విషయమై రైతులకు న్యాయం చేయాలని కోరుతూ అఖిలభారత రైతుసంఘాల సమాఖ్య ప్రధాన ముఖ్యసలహాదారు పెద్దిరెడ్డి చెంగల్‌రెడ్డి పార్లమెంట్ స్టాండింగ్ కమిటీకి రాసిన సుదీర్ఘ లేఖను, వివరాలను వారు ఈ సందర్భంగా ఎంపి ఆదాలకు అందజేశారు. ఈ సమస్యపై పార్లమెంట్ సమావేశాల్లో చర్చించి పవర్ హైటెన్షన్ విద్యుత్ లైన్ల వల్ల నష్టపోతున్న రైతులకు న్యాయమైన పరిహారం ఇప్పించేలా చూడాలని రైతు సంఘాల నాయకులు అభ్యర్థించారు.

# జిఓ 64ను వెంటనే రద్దు చేయించాలి

### మంత్రి డా.అనిల్‌కు ఎన్జీఓ నాయకుల వినతి

వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి డిఎంఅండ్‌హెచ్ఓ, డెప్యూటి డిఎంఅండ్‌హెచ్ఓల అధికారాలను జాయింట్ కలెక్టర్లకు కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జిఓ నెం. 64ను వెంటనే రద్దుచేయించాలని ఏపి ఎన్జీఓ సంఘం జిల్లా శాఖ నాయకులు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈనెల 6న వారు నెల్లూరులో మంత్రిని కలసి ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, 11వ పిఆర్‌సి అమలుచేయాలని, సిపిఎస్ విధానం రద్దుచేయాలని, కోవిడ్ బారిన పడిన ఉద్యోగులకు 15 రోజుల స్పెషల్ లీవ్‌తోపాటు 5 రోజుల ఎర్న్ లీవ్ మంజూరు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మన్నేపల్లి పెంచలరావు, నాయుడు వెంకటస్వామిలతో పాటు సంఘం నాయకులు నాగిశెట్టి గిరిధర్, నందిమండలం ఆంజనేయవర్మ, బండారుపల్లి వెంకటేశ్వర్లు, గొలగమూడి రమేష్‌బాబు, లక్కాకుల పెంచలయ్య, మధు, మాధవయ్య, ఈదూరు విజయకుమార్, సువర్ణకుమారి తదితరులున్నారు.

# గ్యాస్ ధరల భారం తగ్గించాలి

### సిపిఎం ఆధ్వర్యంలో మహిళల ఆందోళన



గ్యాస్ ధరలు పెరిగిపోవడం సామాన్యులపై అదనపు భారం మోపినట్లేనని నిరసన వ్యక్తం చేస్తూ కావలిలోని వెంగళరావునగర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో మహిళలు ఆందోళన చేపట్టారు. బిజెపి ప్రభుత్వం వచ్చాక పెట్రోలు, డీజలు, గ్యాస్ వగైరాల ధరలన్నీ పెరిగిపోయి ప్రజలు నానా బాధలు పడుతున్నారని వారు పేర్కొన్నారు. అసలే కరోనాతో జీవనాధారాలు కోల్పోయి ప్రజలు కష్టాలు పడుతుంటే ఈ ధరల మోత మరింత బాధాకరంగా ఉందని వారన్నారు. వెంటనే ధరలను నియంత్రించాలని, కరోనా కష్టకాలంలో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు 10వేల రూపాయల సాయంతో పాటు నిత్యావసర సరుకులు అందజేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి పెంచలయ్యతో పాటు బి.వెంకటేశ్వర్లు, కె. చెన్నయ్య, పి.శ్రీనివాసులు, ఎస్‌కె బాబు పలువురు మహిళలు పాల్గొన్నారు.



# దివికేగిన దిలీప్

## బాలీవుడ్ సినీ దిగ్గజం కన్నుమూత

భారతీయ సినీ పరిశ్రమకు అమూల్యమైన ఆణిముత్యం, నటనలో కోహినూర్ వజ్రం..విఖ్యాత నటుడు.. బాలీవుడ్ సినీ దిగ్గజం దిలీప్‌కుమార్ ఇక లేరు. ట్రాజెడీ కింగ్‌గా పేరొంది, హిందీ చిత్రసీమలో తనదైన ముద్ర వేసుకున్న దిలీప్‌కుమార్ తన 98వ ఏట శ్వాస సంబంధ సమస్యలతో అనారోగ్యానికి గురై ఈనెల 7వ తేది ఉదయం తుదిశ్వాస విడిచారు. 1944లో 'జ్వార్ భాటా' చిత్రలో హిందీచిత్రసీమలో అడుగుపెట్టిన దిలీప్ ఆ తర్వాత కాలంలో బాగా రాణించి, 'జుగ్ను', 'మిలన్', 'మొఘల్ ఏ అజమ్', 'ఆజాద్', 'దేవదాస్', 'రామ్ ఔర్ శ్యామ్', లాంటి ఎన్నో అపురూప చిత్రాలతో భారతీయ ప్రేక్షకుల మనసుల్లో శాశ్వతమైన ముద్రవేసుకున్నారు. ఆయన విశేష నటనకు గుర్తింపుగా ఎంతో ప్రతిష్టాత్మకమైన దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం, పద్మభూషణ్(1991), పద్మవిభూషణ్ (2015) పురస్కారాలను కూడా ఆయన అందుకున్నారు. 1997లో ఎన్టీఆర్ జాతీయ పురస్కారంతో ఆయన్ను ఘనంగా సత్కరించారు. భారతీయ సినీ పరిశ్రమ రంగంలో ఆయనో సువర్ణాధ్యాయంగా భాసించారు. నవరస భరితమైన నటనా చాతుర్యంతో, అజరామరమైన నటనా కౌశలంతో ప్రేక్షకులను ఉర్రూతలూగించిన సాటి లేని మేటి నటుడు దిలీప్‌కుమార్ అస్తమయంతో భారతీయ సినిమారంగం ఒక పెద్దదిక్కును కోల్పోయినట్లయింది.

# 'రాజన్నా'.. మీ కీర్తే.. మాకు స్ఫూర్తి..!



డాక్టర్ వైయస్ 72వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి, కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి.



నెల్లూరులోని తన నివాసంలో డాక్టర్ వైయస్ఆర్ నిలువెత్తు చిత్రపటానికి నమస్కరించి నివాళులర్పిస్తున్న మాజీమంత్రి, వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి

# కేంద్రంలో.. 'కరె(ఎల)క్షన్ క్యాబినెట్

- మోడీ జంబో కేబినెట్‌లో..కొత్తగా 36 మందికి కొలువులు
- ఏడుగురికి పదోన్నతి..12 మంది సీనియర్లకు ఉద్వాసన

***ప్రధాని మోడీ ఎట్టకేలకు మంత్రి వర్గాన్ని పునర్వ్యవస్థీకరించారు. పలువురికి పదోన్నతి కల్పించారు. మరికొందరికి ఉద్వాసన పలికారు. మొత్తంగా ఉన్న వారిలో 12 మందిని సాగనంపారు. 7గురికి పదోన్నత కల్పించారు. 36 మందిని కొత్తగా కొలువులోకి తీసుకున్నారు.***

రెండోసారి ప్రధాని పీఠాన్ని అధిష్టించి రెండేళ్ల తర్వాత మొదటిసారి మంత్రి వర్గాన్ని పునర్వ్యవస్థీకరించి ప్రధాని మోడీ తనదైన ప్రత్యేకతను నిరూపించుకున్నారు. ఈనెల 7న జరిగిన కేంద్రమంత్రివర్గ విస్తరణ భారీ మార్పులతో జంబో కేబినెట్‌గా మారింది. దీంతో ప్రధాని సహా మంత్రుల సంఖ్య 78కి చేరింది. ప్రకాశ్ జవదేకర్, రవిశంకర్, హర్షవర్ధన్, సదానందగౌడ, రమేశ్ పోఖ్రియాల్ వంటి సీనియర్లకు ఉద్వాసన పలికారు. దీంతో సీనియర్లుగా ఉంటూ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న నేతల్ని మోదీ వదిలించేసుకుంటున్నారేమోననే సందేహాలు కూడా వచ్చాయి. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తరప్రదేశ్‌కు, సొంత రాష్ట్రం గుజరాత్‌కు ప్రాధాన్యత ఇవ్వడం చర్చనీయాంశమైంది. గుజరాత్, కర్నాటకల్లో బిజెపి పునాదులను బలోపేతం చేసుకోవడంతో పాటు ఈశాన్య, హిమాలయ రాష్ట్రాల్లోనూ పార్టీ పట్టు సాధించడానికి మోదీ, అమిత్ షాల వ్యూహంతో ఏర్పడిన కూర్పుగా ఈ కొత్త మంత్రివర్గం ఉందంటూ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇకపోతే, కేంద్ర మంత్రివర్గంలో కిషన్‌రెడ్డితో సహా ఏడుగురు సహాయమంత్రులకు కేబినెట్ హోదా ఇచ్చారు. ఏదేమైనా మోదీ కొత్త మంత్రివర్గం కొత్తవారికి ఆనందంగా, పాతవారికి కొంత ఆవేదనగా నిలిచింది.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com